సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శనివారం, 03.10.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 333
పేజీలు: 08 వెల: రూ. 5

జర్నలిస్టుల హక్కుల సాధనకు

## రాజీలేని పోరాటాలు

మీడియా స్వేచ్ఛ, భద్రతకు ప్రత్యేక చట్టం అవసరం

- జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి
- హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు, సమస్యలు పరిష్కరించాలి
- ఐజేయూ, టీయూడబ్ల్యూజే నేతల డిమాండ్
- ఐజేయూ పిలుపుతో గన్‌పార్క్ వద్ద జర్నలిస్టుల భారీ నిరసన

02



ముందు హనుమాన్ చాలీసా..

## ఆ తర్వాత పోరాటం

- మోదీతో వీడియోకాల్‌లో ఫ్లైదుబాయ్ కెప్టెన్ స్మిత్ భావోద్వేగం
- కాక్‌పిట్‌లో దాడి.. అయినా విమానం కాపాడిన పైలట్
- మోదీతో విమానంలోని భయానక క్షణాలను పంచుకున్న స్మిత్

02





గాంధీ జయంతి సందర్భంగా బాపూ ఘాట్ వద్ద జాతిపిత బాపూజీకి ప్రముఖులు నివాళులర్పించారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి, అజారుద్దీన్ అంజలి ఘటించారు. చిత్ర ప్రదర్శనను గవర్నర్, సీఎం తిలకించారు.
**-ముద్ర, హైదరాబాద్:**

## అందుబాటులోకి కామన్ పాస్

మెట్రో, ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. 03

- ఒకే పాస్‌తో మెట్రో, ఆర్టీసీ ప్రయాణం.. ధరలు ఇవే
- రోజువారీ, నెలవారీ కామన్ పాస్‌లు..
- హైదరాబాద్ ప్రజలకు సరికొత్త ట్రావెల్ సదుపాయం..
- మెట్రో-ఆర్టీసీ అనుసంధానించి పాస్‌ను ఆవిష్కరించిన భట్టి



# రాజకీయ దుమారం!

## రేవంత్ వ్యాఖ్యలతో కొత్త చర్చ

## సీఎం మాటల మంటలు

- రాముడు ధనికుల దేవుడా? శివుడు పేదల దేవుడా?
- దేవుళ్లపై రేవంత్ వ్యాఖ్యలు.. బీజేపీకి అస్త్రమా?
- హిందూత్వానికి కాంగ్రెస్ కొత్త కౌంటర్ వ్యూహమా?
- రాముడు—శివుడి మధ్య విభజన.. కాంగ్రెస్‌కు లాభమా?
- ఆర్య—ద్రావిడ వ్యాఖ్యలతో ముదిరిన రాజకీయం!
- రేవంత్ వ్యాఖ్యలు కాంగ్రెస్‌కు సెల్ఫ్ గోల్ అవుతాయా?
- దేవుళ్లను రాజకీయాల్లోకి లాగడంపై తీవ్ర చర్చ!
- రాముడు వర్సెస్ శివుడు.. రాజకీయంగా ఎవరికి లాభం?



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. రాముడు ధనికుల దేవుడు.. శివుడు పేదల దేవుడు అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలతో పాటు ఆర్య—ద్రావిడ, ఉత్తరాది—దక్షిణాది అంశాలను ప్రస్తావించడం రాజకీయంగా తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ మధ్య హిందూత్వ రాజకీయాలపై కొనసాగుతున్న పోరుకు ఈ వ్యాఖ్యలు మరింత ఆజ్యం పోశాయి. ఒకవైపు బీజేపీ హిందూ సమాజాన్ని ఏకీకృతం చేస్తూ రాజకీయంగా ముందుకు వెళ్తుంటే.. మరోవైపు కాంగ్రెస్ ఆ సమీకరణాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కొత్త రాజకీయ వ్యూహాన్ని అమలు చేస్తోందా? అన్న చర్చ మొదలైంది.

**హిందూత్వానికి కౌంటర్‌గా వ్యూహమా?**
బీజేపీ రాజకీయ ప్రస్థానంలో హిందూత్వం కీలక అంశంగా మారింది. ముఖ్యంగా రామమందిరం వంటి అంశాల ద్వారా దేశవ్యాప్తంగా హిందూ ఓటర్లను ఏకతాటిపైకి తీసుకురావడంలో ఆ పార్టీ కొంతమేర విజయవంతమైంది. ఈ నేపథ్యంలో బీజేపీ బలపడుతున్న హిందూ ఓటు సమీకరణాన్ని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ కొత్త రాజకీయ కథనాన్ని తెరపైకి తీసుకొస్తోందన్న విశ్లేషణలున్నాయి. గతంలో రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో శివుడి చిత్రాన్ని ప్రదర్శిస్తూ ప్రసంగించిన సందర్భాన్ని కూడా రాజకీయ పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి రాముడు—శివుడు, ఆర్య—ద్రావిడ అంశాలను ప్రస్తావించడం ద్వారా కాంగ్రెస్ తన రాజకీయ వ్యూహాన్ని మరింత స్పష్టంగా ముందుకు తీసుకెళ్తోందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
అయితే ఇది నిజంగా బీజేపీ హిందూత్వ రాజకీయాలకు సమర్థవంతమైన కౌంటర్ అవుతుందా? లేక కాంగ్రెస్‌కే ఎదురుదెబ్బగా మారుతుందా? అనేది అసలు ప్రశ్న.

**రాముడు వర్సెస్ శివుడు.. సాధ్యమేనా?**
భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో రాముడు, శివుడు అత్యంత ప్రధానమైన దైవ స్వరూపాలు. భక్తి సంప్రదాయాల్లో వేర్వేరు ఆరాధనా పద్ధతులు ఉన్నప్పటికీ, ఒక దేవుడిని ఒక వర్గానికి.. మరో దేవుడిని మరో వర్గానికి పరిమితం చేయడం సాధారణ ప్రజల విశ్వాసాలకు భిన్నంగా ఉంటుంది. ప్రత్యేకించి తెలంగాణలో రాముడికి, శివుడికి సమానమైన ప్రాధాన్యం ఉంది. భద్రాచలం శ్రీరాముడిని 'దక్షిణ అయోధ్య'గా, వేములవాడ రాజరాజేశ్వర స్వామిని 'దక్షిణ కాశీ'గా భక్తులు భావిస్తారు. తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక జీవితంలో ఈ రెండు క్షేత్రాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఇలాంటి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి రాముడు—శివుడి మధ్య ధనిక—పేద విభజనను ప్రస్తావించడం సహజంగానే రాజకీయ చర్చకు దారితీస్తోంది.

**ఉత్తరాది—దక్షిణాది రాజకీయాలకు తెర?**
రేవంత్ వ్యాఖ్యల్లో మరో కీలక అంశం ఉత్తరాది—దక్షిణాది, ఆర్య—ద్రావిడ వాదన. దక్షిణ భారత రాజకీయాల్లో ద్రావిడ భావజాలం కొత్తది కాదు. అయితే తెలంగాణ వంటి రాష్ట్రంలో ఈ సిద్ధాంతాన్ని హిందూ దేవతల ఆరాధనతో ముడిపెట్టడం కొత్త రాజకీయ ప్రయోగంగా కనిపిస్తోంది. దక్షిణాది ప్రజలను ద్రావిడులుగా, ఉత్తరాది ప్రజలను ఆర్యులుగా విభజించి.. వారి **మిగతా 02లో**

సర్కారీ బడి పిల్లలకు

## బ్రేక్‌ఫాస్ట్

సీఎం కీలక ఆదేశాలు 02



- నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్ల నిర్మాణం పూర్తి
- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభం
- విద్యార్థుల ఆరోగ్యం, విద్యా పురోగతిపై ట్రాక్ రికార్డు
- బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ పై హరే కృష్ణ ఫౌండేషన్ కు ఆదేశాలు
- కిచెన్ నిర్మాణాలకు రెండు సంస్థలు రూ. 9.17 కోట్లు విరాళం

అమెరికాను టెన్షన్ పెట్టిన

## భారత్ సీక్రెట్ మిషన్

అమెరికా మాజీ అధికారి సంచలన వ్యాఖ్యలు

- 2019లో భారత్ ప్రయోగంతో అమెరికా టెన్షన్
- మిషన్ శక్తి వెనుక అసలు కథ ఇదే
- భారత్ ASAT టెస్ట్‌తో అమెరికా నిఘా వర్గాల్లో కలకలం
- నలుగురికే తెలిసిన ఆ రహస్య ప్రయోగం!

02



## ఆటో ఛార్జీలు పెంపు 02

- 1.6 కి.మీకి రూ.30.. ఆపై కిలోమీటర్‌కు రూ.14
- రాత్రి ఆటో ప్రయాణం మరింత ఖరీదు.. 50% అదనపు ఛార్జీ
- ఆటో మీటర్ల సవరణకు డ్రైవర్లకు 3 నెలల గడువు



## ఫ్రూట్ బౌల్‌గా రాయలసీమ

ఏపీ సీఎం చంద్రబాబు

- నీళ్లుంటే రైతులు బంగారం పండిస్తారు
- రాయలసీమకు కొత్త రూపం
- నీళ్లిస్తే బంగారం పండిస్తారు
- రైతులపై చంద్రబాబు ప్రశంసలు
- రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు

సీమలో భారీ మార్పులకు శ్రీకారం



**ముద్ర, మదనపల్లె:**
కరవు ప్రాంతం రాయలసీమ దశ–దిశను సమూలంగా మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాయలసీమను ఫ్రూట్ బౌల్ గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి రాయలసీమ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ISA)లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. **మిగతా 02లో**

ఇదీ AI ముద్ర

ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ.. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ఏపీ సీఎం చంద్రబాబు కు వీడ్కోలు పలుకుతూ వారి పాదాలకు నమస్కరించడం విశేషం



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శనివారం,
03 అక్టోబర్, 2026
2
జనరల్ న్యూస్
General NEWS

కేలరీలు తక్కువగా, ఫైబర్ ఎక్కువగా ఉండే బ్రోకలీని ఆహారంలో చేర్చుకోవచ్చు. ఇది ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తుంది.



# రాజకీయ దుమారం!



(మొదటి పేజీ తరువాయి)

ఆరాధనా పద్ధతులను కూడా అదే కోణంలో చూడటం రాజకీయంగా ఎంతవరకు ఫలితాన్నిస్తుంది అన్నది ప్రశ్న. ఇప్పటికే భాష, ప్రాంతం, కులం, మతం వంటి అంశాలపై దేశంలో రాజకీయ విభజనలు ఉన్న సమయంలో దేవతల ఆరాధనను కూడా ప్రాంతీయ విభజనతో ముడిపెట్టడం కొత్త వివాదాలకు దారి తీసే అవకాశముంది

**బీజేపీకి దొరికిన మరో అస్త్రమా?**

కాంగ్రెస్ వ్యూహంలో ఉన్న అతిపెద్ద ప్రమాదం ఇదే అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రేవంత్ వ్యాఖ్యలను బీజేపీ సులభంగా రాజకీయ ఆయుధంగా మార్చుకునే అవకాశం ఉంది. "కాంగ్రెస్ హిందూ దేవుళ్లను కూడా విభజిస్తోంది", "హిందూ విశ్వాసాలపై రాజకీయాలు చేస్తోంది" అంటూ బీజేపీ ప్రజల్లోకి వెళ్లేందుకు ఈ వ్యాఖ్యలు ఉపయోగపడవచ్చు. బీజేపీకి ఇప్పటికే బలమైన హిందూత్వ రాజకీయ కథనం ఉంది. అలాంటి సమయంలో కాంగ్రెస్ నేతల నుంచి వచ్చే వివాదాస్పద వ్యాఖ్యలు బీజేపీ ప్రచారానికి మరింత బలం చేకూర్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా సాధారణ భక్తుడికి రాముడూ, శివుడూ వేర్వేరు రాజకీయ వర్గాలకు చెందిన దేవుళ్లు కాదు. ఇద్దరూ ఆరాధ్య దైవాలే. ఈ భావోద్వేగాన్ని రాజకీయంగా కదిలిస్తే ప్రతికూల ఫలితాలు రావచ్చన్న అంచనాలు ఉన్నాయి.

**కాంగ్రెస్‌కు కొత్త ఓటు బ్యాంకు వస్తుందా?**

కాంగ్రెస్ వ్యూహం వెనుక మరో రాజకీయ లెక్క ఉందన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి. హిందూ సమాజంలో ఉన్న ప్రాంతీయ, సామాజిక, సాంస్కృతిక వైవిధ్యాన్ని రాజకీయంగా ఉపయోగించుకుని బీజేపీకి ఉన్న ఏకీకృత హిందూ ఓటు బ్యాంకును విభజించాలన్నది ఆ వ్యూహం కావచ్చని విశ్లేషకులు అంటున్నారు. అయితే ఆ వ్యూహం విజయవంతం కావాలంటే కేవలం బీజేపీని విమర్శించడం సరిపోదు. ప్రజలకు ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయ రాజకీయ కథనాన్ని కూడా కాంగ్రెస్ ముందుకు తీసుకురావాల్సి ఉంటుంది. లేకపోతే కేవలం దేవుళ్ల మధ్య, ప్రాంతాల మధ్య విభజనను ప్రస్తావించడం వల్ల కాంగ్రెస్‌కు కొత్త ఓటర్లు చేరడం కంటే ఉన్నవానిలో గందరగోళం ఏర్పడచ్చు.

**'సెల్ఫ్ గోల్' అయ్యే ప్రమాదం**

రాజకీయాల్లో భావోద్వేగ అంశాలు అత్యంత సున్నితమైనవి. ముఖ్యంగా మతం, దేవుళ్లు, విశ్వాసాలకు సంబంధించిన అంశాలను రాజకీయ వ్యూహాల్లో ఉపయోగించేటప్పుడు చాలా జాగ్రత్త అవసరం. బీజేపీ హిందూత్వానికి కౌంటర్ ఇవ్వాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ఇలాంటి అంశాలను తెరపైకి తీసుకొస్తే.. అది చివరకు బీజేపీకి మరింత బలమైన ప్రచార ఆయుధంగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికే బీజేపీ రామ మందిరం, హిందూ వారసత్వం, ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధి వంటి అంశాలను రాజకీయంగా బలంగా ప్రచారం చేస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతల నుంచి రాముడు–శివుడు లేదా ఉత్తరాది–దక్షిణాది వంటి విభజనాత్మక వ్యాఖ్యలు వస్తే.. బీజేపీ తన రాజకీయ కథనాన్ని సులభంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉంటుంది.

**రాజకీయ లాభం ఎవరికి?**

రేవంత్ వ్యాఖ్యలతో కాంగ్రెస్‌కు తక్షణ రాజకీయ లాభం దక్కుతుందా? అన్నది అనుమానంగానే ఉంది. ఒకవేళ కాంగ్రెస్ లక్ష్యం బీజేపీ హిందూ ఓటు సమీకరణాన్ని బలహీనపరచడమే అయితే.. అందుకు దేవతలను వర్గాలుగా విభజించడం ఎంత వరకు సరైన వ్యూహమన్న ప్రశ్న ఎదురవుతోంది. మరోవైపు బీజేపీ మాత్రం ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్‌పై విస్తృత ప్రచారానికి ఉపయోగించుకునే అవకాశం ఉంది.దీంతో బీజేపీని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ వేసిన అడుగు.. బీజేపీకే కొత్త రాజకీయ అవకాశాన్ని కల్పిస్తుందా? అన్న చర్చ తెలంగాణతో పాటు జాతీయ రాజకీయాల్లోనూ మొదలైంది.

**కౌంటర్ స్ట్రాటజీ.. కాంగ్రెస్‌కు సెల్ఫ్ గోల్?**

మొత్తంగా చూస్తే రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు కేవలం ఒక రాజకీయ నేత వ్యాఖ్యలుగా కాకుండా.. కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయ వ్యూహంపై చర్చకు దారితీసే అంశంగా మారాయి. హిందూత్వానికి ప్రత్యామ్నాయం చూపించాలంటే విభజన రాజకీయాలకంటే అభివృద్ధి, సంక్షేమం, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ముందుకు తీసుకెళ్లడం మరింత ప్రభావవంతంగా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దేవుళ్లను రాజకీయంగా విభజించడం ద్వారా కాంగ్రెస్ బీజేపీ హిందూత్వాన్ని బలహీనపరుస్తుందా? లేక అదే బీజేపీ హిందూత్వ రాజకీయాలకు మరింత బలం చేకూరుస్తుందా? రేవంత్ వ్యాఖ్యలు కాంగ్రెస్‌కు రాజకీయ మైలేజీ తెస్తాయా.. లేక చివరకు 'సెల్ఫ్ గోల్'గా మిగిలిపోతాయా? అన్నది రాజకీయ పరిణామాలు నిర్ణయించనున్నాయి.

# జర్నలిస్టుల హక్కుల సాధనకు పోరాటాలు



**ముద్ర, హైదరాబాద్:**

జర్నలిస్టుల హక్కుల సాధన, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలు కొనసాగించాల్సిన అవసరం ఉందని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ), తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) నాయకులు అన్నారు. ఐజేయూ ఇచ్చిన పిలుపు మేరకు గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఎదురుగా గన్‌పార్క్ వద్ద టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని, మీడియా స్వేచ్ఛను పరిరక్షించాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని నినాదాలు చేశారు.

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, ఐజేయూ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, ఆరోగ్య రక్షణ, ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్, సంక్షేమ పథకాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఐజేయూ పిలుపు మేరకు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జర్నలిస్టులు తమ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం కీలకమైన నాలుగో స్తంభమని, జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, వేతనాలు, పని పరిస్థితులు, సామాజిక భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

పత్రికా స్వేచ్ఛ, జర్నలిస్టుల రక్షణతో పాటు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం మరింత బలోపేతం కావాలంటే పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని పేర్కొన్నారు.

తెలంగాణలో జర్నలిస్టుల హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాలు, తదితర అంశాలపై ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు మీడియా అకాడమీ చైర్మన్‌గా తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**స్వతంత్ర జర్నలిజమే ప్రజాస్వామ్యానికి బలం**

**- ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్**

సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే మీడియా ప్రజల సమస్యలను స్వతంత్రంగా వెలుగులోకి తీసుకురావాలన్నారు. పరిశోధనాత్మక జర్నలిజానికి ఎంతో ప్రాధాన్యం ఉందని, అదే సమయంలో ప్రతి కథనాన్ని ఆధారాలు, పత్రాలు, సంబంధిత వర్గాల స్పందనతో నిర్ధారించుకోవాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు. మీడియాపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే స్వతంత్రత, వాస్తవ నిర్ధారణ, జవాబుదారీతనం, ప్రజా ప్రయోజనం జర్నలిజానికి కేంద్రంగా ఉండాలన్నారు. జర్నలిస్టుల హక్కులు, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్, ఉద్యోగ, సామాజిక భద్రత కోసం దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి**

**టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ**

విరాహత్ అలీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర రాజధానిలో అమరవీరుల సాక్షిగా జర్నలిస్టుల హక్కుల కోసం ఆందోళన చేయాల్సి రావడం విచారకరమన్నారు. గత పదిహేనేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించినట్లు గుర్తుచేశారు.జర్నలిస్టులపై ఒత్తిళ్లు, కేసులు, అరెస్టులు, నిర్బంధం వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ప్రజల తరఫున ప్రశ్నించే జర్నలిస్టులు స్వేచ్ఛగా పనిచేసే వాతావరణాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో జర్నలిస్టులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదన్నారు. ఇళ్ల స్థలాలు, సమగ్ర ఆరోగ్య భద్రత, అన్ని ప్రధాన ఆసుపత్రుల్లో హెల్త్ కార్డుల అమలు, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య కల్పించాలని కోరారు. చిన్న, మధ్యతరహా పత్రికలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రకటనల బిల్లులు, ఇతర బకాయిలను చెల్లించి ఆదుకోవాన్నారు.

**జాతీయ జర్నలిస్టుల భద్రతా చట్టం తేవాలి**

**టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ**

కె. రాంనారాయణ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై పాలకులు తగిన దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక జాతీయ జర్నలిస్టుల భద్రతా చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. మీడియా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి పరిష్కార మార్గాలు సూచించేందుకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు.మజిథియా వేజ్ బోర్డు తర్వాత జర్నలిస్టుల వేతనాలపై సమగ్రంగా దృష్టి సారించే వ్యవస్థ లేకపోవడంతో వేలాది మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తెలంగాణలో ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, సంక్షేమ పథకాలపై ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. భవిష్యత్తులో జర్నలిస్టుల హక్కుల సాధనకు ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

**మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి**

**ఐజేయు ఉపాధ్యక్షులు వై. నరేందర్ రెడ్డి**

వై. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జర్నలిస్టుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు, మీడియా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసేందుకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని ఐజేయూ చాలా కాలంగా డిమాండ్ చేస్తోందన్నారు. జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, వేతనాలు, సామాజిక భద్రత, పని పరిస్థితులకు సంబంధించిన రక్షణలను మరింత బలోపేతం చేయాలన్నారు. తెలంగాణలో జర్నలిస్టులకు సమగ్ర ఆరోగ్య భద్రతతో పాటు క్యాష్‌లెస్ వైద్య సదుపాయాలు అందించాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు, అధికారులను పలుమార్లు కలిసి విజ్ఞప్తులు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం రావాల్సి ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా జర్నలిస్టుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు.

**ప్రెస్ కౌన్సిల్‌ను మరింత బలోపేతం చేయాలి**

**ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ. మజీద్**

ఎం.ఏ. మజీద్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల భద్రత, ఉద్యోగ భద్రత, వేతనాలు, సామాజిక భద్రత, స్వేచ్ఛగా పనిచేసే హక్కులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ జర్నలిస్టుల భద్రతా చట్టం, మీడియా కమిషన్ ఏర్పాటు తమ ప్రధాన డిమాండ్లని పేర్కొన్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను మరింత సమర్థవంతంగా, స్వతంత్రంగా, జవాబుదారీతనంతో పనిచేసేలా బలోపేతం చేయాలని కోరారు. తెలంగాణలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, వైద్య సదుపాయాలు, జర్నలిస్టుల కుటుంబాల సామాజిక భద్రతకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. తమ పోరాటం ఏ వ్యక్తికో, సంస్థకో వ్యతిరేకంగా కాదని, జర్నలిస్టుల హక్కులు, మీడియా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ కార్యవర్గ సభ్యులు కే.సత్యనారాయణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు వి.యాదగిరి, బొమ్మగాని కిరణ్ కుమార్,రాజేష్ హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్( హెచ్.యు.జె) అధ్యక్ష, కార్యదర్శులు శిగ శంకర్ గౌడ్,షౌకత్ చిన్న మధ్యతరహా పత్రికల జర్నలిస్టుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులుయూసుఫ్ బాబు,అశోక్, దాసు, ఉర్దూ జర్నలిస్ట్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ గౌస్, ఫోటో జర్నలిస్టుల సంఘం నాయకులు కె.ఎన్. హరి, అనిల్, వీడియో జర్నలిస్టుల సంఘం నాయకులు హరీష్, సన్నీ,నాగరాజు, హెచ్యూజే నాయకులు వెంకటా చారి, భరత్ చారి, అమరేశ్వర్ రెడ్డి, ఇబ్రహీం, రఫీ, ప్రతిభ, ఆజాంఖాన్ , వెంకటయ్య, ఆగస్టిన్, సాజిదాతదితరులు పాల్గొన్నారు.

# ఫ్రూట్ బౌల్‌గా రాయలసీమ



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రాథమిక రంగం వృద్ధిలో హార్టికల్చర్‌ది కీలక పాత్ర అని, రాబోయే రోజుల్లో మరో 6 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరించి రాయలసీమ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. రాయలసీమ రైతుల శ్రమను కొనియాడిన సీఎం చంద్రబాబు సరిపడా సాగునీరు అందిస్తే ఈ నేలలో బంగారం పండించే సత్తా ఇక్కడి రైతులకు ఉందన్నారు. 20 రకాల పంటల్లో ఏ పంటనైనా పండించగల ప్రతిభ ఈ ప్రాంత రైతుల సొంతమని, ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే సంపద సృష్టిస్తారని కితాబిచ్చారు.

ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా పంటల సాగుతో పాటు ధరల స్థిరీకరణ సాధ్యమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని.. హంద్రీనీవా ప్రాజెక్ట్ నీళ్లు రాకపోతే మదనపల్లె నుంచి పెద్ద ఎత్తున వలసలు ఉండేవన్నారు. రాయలసీమను కరవు నుంచి కాపాడేందుకు డ్రిప్ ఇరిగేషన్, వాటర్ షెడ్ పథకాలు, పంటకుంటల ద్వారా జలసంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను వచ్చే మూడేళ్లలో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే హంద్రీనీవా ఫేజ్–2, వెలిగొండ ఫేజ్–2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో అథితిగా పాల్గొన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీపై ఏపీ సీఎం చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. అనంత్ అంబానీ కేవలం ఒక విజన్ ఉన్న యువ పారిశ్రామికవేత్త మాత్రమే కాదని, గొప్ప పర్యావరణ పరిరక్షకుడని కొనియాడారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఏకంగా 3,500 ఎకరాలలో వంతార పేరుతో జంతువుల పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి మూగజీవులను సంరక్షిస్తున్నారని పేర్కొన్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిపై ఉన్న అపారమైన భక్తిశ్రద్ధలతో పర్యావరణహితం కోసం ఇటీవల తిరుమలకు ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సులను అందజేశారని సీఎం గుర్తు చేసుకున్నారు.

# సర్కారీ బడి పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్

**ముద్ర, హైదరాబాద్:**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు హరే కృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నాయి. హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు, జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ప్రతినిధులు ముఖ్యమంత్రిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు ఈ రెండు సంస్థలు హరేకృష్ణ ఫౌండేషన్‌కు సహకారం అందిస్తాయి. నాగర్‌కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం జున్నా సోలార్ సిస్టమ్స్ సంస్థ సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబుతో కలిసి రూ. 5.17 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా హరే కృష్ణ ఫౌండేషన్‌కు అందించారు. వికారాబాద్‌లో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం కోసం చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థ ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్‌తో కలిసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ.4 కోట్ల చెక్కును హరే కృష్ణ ఫౌండేషన్‌కు అందించారు.

ఒక మంచి కార్యక్రమానికి నిధులు అందించి సహకరించడానికి ముందుకు వచ్చిన సంస్థల ప్రతినిధులను ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరే కృష్ణ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామీజీతో పాటు ఇతర ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వచ్చే డిసెంబర్ 9 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి సెంట్రలైజ్డ్ కిచెన్లను ప్రారంభించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. నవంబర్ 30వ తేదీలోగా ఈ కిచెన్ల ఏర్పాట్లు పూర్తయ్యేలా చూడాలని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నిర్వహించాలని, విద్యార్థుల శారీరక పెరుగుదల, విద్యా పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆహారంలో ఇచ్చే పదార్థాల కేలరీలను లెక్కించడానికి యాప్‌లను ఉపయోగించుకోవాలని చెప్పారు. బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని, విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ప్రాంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్‌ను అందించే విధంగా చూడాలని, జీవితకాలం కొనసాగించాల్సిన ఈ కార్యక్రమం కాబట్టి సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని సూచించారు.

# అమెరికాను టెన్షన్ పెట్టిన సీక్రెట్ మిషన్

**ముద్ర, న్యూఢిల్లీ :**

సాంకేతిక, రక్షణ రంగాల్లో భారత్ సాధించిన విజయాల్లో 2019లో చేపట్టిన 'మిషన్ శక్తి' (ASAT) పరీక్ష కీలకమైనది. ఈ ప్రయోగం సమయంలో అమెరికా నిఘా వర్గాల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నట్లు అమెరికా మాజీ ఎయిర్ ఫోర్స్ ఇంటెలిజెన్స్ అధికారి డేవిడ్ గ్రుష్ తాజాగా వెల్లడించారు.

జో రోగన్ పాడ్‌కాస్ట్‌లో గ్రుష్ మాట్లాడుతూ.. 2019లో భారత్ ముందస్తు సమాచారం లేకుండా తన ఉపగ్రహాన్ని క్షిపణితో కూల్చివేసిందని చెప్పారు. ఒడిశా తీరంలో జారీ చేసిన NOTAM ద్వారా క్షిపణి పరీక్ష జరుగుతోందని తెలిసినా, అది యాంటీ శాటిలైట్ పరీక్ష అని అమెరికా ఊహించలేదన్నారు. దీంతో అమెరికా అధికారులు వెంటనే ఎంబసీలు, ఉన్నతాధికారులను సంప్రదించారని తెలిపారు.

ఆ సమయంలో తాను NROలో ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్నానని చెప్పిన గ్రుష్.. ఉపగ్రహాన్ని కూల్చివేయడం వల్ల ఏర్పడే అంతరిక్ష వ్యర్థాలు అమెరికా గూఢచారి ఉపగ్రహాలను ఢీకొనే ప్రమాదంపై ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఆర్బిటల్ అనలిస్టులను సంప్రదించి వ్యర్థాల వ్యాప్తి, ఉపగ్రహాల మార్గాల్లో మార్పులు అవసరమా అనే విషయాలను పరిశీలించినట్లు వెల్లడించారు.

**నాలుగో దేశంగా భారత్**

'మిషన్ శక్తి' ద్వారా భారత్ తక్కువ ఎత్తులో ఉన్న 'మైక్రోశాట్ –ఆర్' ఉపగ్రహాన్ని కూల్చివేసింది. దీంతో అమెరికా, రష్యా, చైనా తర్వాత యాంటీ శాటిలైట్ సామర్థ్యాన్ని ప్రదర్శించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. తక్కువ ఎత్తులో పరీక్ష నిర్వహించడం వల్ల ఏర్పడిన వ్యర్థాలు కొద్ది వారాల్లోనే వాతావరణంలోకి ప్రవేశించి కాలిపోతాయని భారత్ స్పష్టం చేసింది.

ఈ ప్రయోగం అత్యంత రహస్యంగా జరిగినట్లు DRDO మాజీ చైర్మన్ సతీశ్ రెడ్డి గతంలో వెల్లడించారు. 2016లో ప్రధాని, అప్పటి NSA అజిత్ దోవల్‌కు ఈ ప్రయోగంపై ప్రజెంటేషన్ ఇచ్చినట్లు తెలిపారు. ప్రయోగానికి సంబంధించిన పూర్తి సమాచారం కేవలం నలుగురు లేదా ఐదుగురు శాస్త్రవేత్తలకు మాత్రమే తెలుసని ఆయన పేర్కొన్నారు.

# హనుమాన్ చాలీసా

**ముద్ర, న్యూఢిల్లీ:**

ఫ్లైదుబాయ్ విమానంలో కాక్‌పిట్‌లో జరిగిన దాడిలో గాయపడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వీడియోకాల్‌లో పరామర్శించారు. యూఏఈ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్ ఆరోగ్య పరిస్థితిని మోదీ అడిగి తెలుసుకున్నారు. క్లిష్ట సమయంలో ఆయన చూపిన ధైర్యం, సమయస్ఫూర్తిని ప్రధాని అభినందించారు. ఈ సందర్భంగా స్మిత్ తన అనుభవాన్ని మోదీతో పంచుకున్నారు. అనూహ్య పరిస్థితులు ఎదురైనప్పుడు తాను హనుమాన్ చాలీసా పఠిస్తానని, కాక్‌పిట్‌లో దాడి జరిగిన సమయంలోనూ అదే చేశానని చెప్పారు. తీవ్రంగా గాయపడినా తన ప్రాణాల గురించి ఆలోచించకుండా ప్రయాణికుల భద్రతకే ప్రాధాన్యం ఇచ్చానన్నారు. ''నేను ఎలాగైనా లేవాలి.. లేదంటే నాతో పాటు అందరూ ప్రమాదంలో పడతారు'' అని ఆ సమయంలో భావించినట్లు స్మిత్ తెలిపారు. మోదీ నుంచి కాల్ రావడం తనకు ఎంతో ప్రత్యేకమైన క్షణమని, తాను ఎంతగానో భావోద్వేగానికి గురయ్యానని చెప్పారు. కాగా, ప్రస్తుతం స్మిత్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు భారత దౌత్యకార్యాలయం తెలిపింది. కాక్‌పిట్‌లో తీవ్రంగా గాయపడినప్పటికీ విమానాన్ని సురక్షితంగా నడిపించేందుకు ఆయన చేసిన ప్రయత్నాలపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# ఆటో ఛార్జీలు పెంపు

**ముద్ర, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో ఆటో ప్రయాణికులకు బిగ్ షాక్ తగిలింది. పెరిగిన ఇంధన ధరలు, నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో ఆటో ఛార్జీలను పెంచుతున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీఓ నంబర్ 46ను జారీ చేసింది. వెంటనే దీనిని అమలు చేయాలని రవాణాశాఖను ఆదేశించింది. నూతన నిబంధనల ప్రకారం ఆటో ప్రయాణానికి కనీస ఛార్జీ రూ.30గా నిర్ణయించింది. మొదటి 1.6 కిలోమీటర్లకు రూ.30, ఆ తర్వాత ప్రతి కిలోమీటరుకు అదనంగా రూ.14 వసూలు చేయాలని నిర్ణయించింది. ఇక రాత్రి వేళల్లో ప్రయాణించే వారికి అదనపు ఛార్జీలు వర్తించనున్నాయి. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్య ప్రయాణించే వారు సాధారణ ఛార్జీ కంటే 1.5 రెట్లు (అదనంగా 50 శాతం) చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశాయి. ట్రాఫిక్ లేదా మరే ఇతర కారణం చేతనైనా ఆటో ఆగిపోతే వెయిటింగ్ ఛార్జీలను నిమిషానికి 75 పైసలుగా నిర్ణయించారు. లగేజీపై కూడా ఛార్జీలు విధించారు. తక్కువ లగేజీకి ఎలాంటి ఛార్జీ లేదు. పరిమితికి మించి లగేజీ ఉంటే ప్యాకేజీకి రూ.0.50 పైసల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా 100 కేజీల వరకూ ఆటోల్లో లగేజీని తీసుకెళ్లవచ్చు. పెరిగిన ఛార్జీలతో ప్రయాణికులపై కాస్త భారం పడనున్నప్పటికీ, ఆటో డ్రైవర్ల శ్రేయస్సును పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. తాజాగా సవరించిన ఛార్జీలకు అనుగుణంగా మీటర్లను సరిచేసుకునేందుకు ఆటో డ్రైవర్లకు మూడు నెలల సమయం ఇచ్చారు.

## ఫ్యాటీ లివర్ : క్యారెట్లు తినండి

బీటా కెరోటిన్, ఫైబర్ అధికంగా ఉండే క్యారెట్లను సలాడ్‌గా లేదా కూరగా తీసుకోవచ్చు. సమతుల్య ఆహారంలో ఇవి మంచి ఎంపిక



## నెలలో ఒకరోజు స్వచ్ఛతపై దృష్టి పెట్టాలి

**-సీఎం చంద్రబాబు**



**ముద్ర, అమరావతి** : నెలలో ఒకరోజు స్వచ్ఛతపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు పిలుపునిచ్చారు. శుక్ర వారం సాయంత్రం విజయ వాడలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రంలో పాల్గొన్న సీఎం.. స్వచ్ఛగ్రామాలు, పట్టణాలు, సంస్థలకు అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శనివారం వస్తే తనకు గుర్తొచ్చేది స్వచ్ఛాంధ్ర కార్యక్రమమేనన్నారు.''స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే అనుకోవద్దు. సామాజిక బాధ్యతగా చూడాలి. ఐదు కోట్ల మంది ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. వారసత్వానికి మనం అందించేది స్వచ్ఛాంధ్ర కార్యక్రమమే. స్వచ్ఛత అంటే కేవలం రోడ్లు శుభ్రంగా ఉంటే సరిపోదు.. మన ఆలోచనా విధానం మారాలి. చెత్తను మా ప్రభుత్వం సమస్యగా చూడటం లేదు.. చెత్తను సంపదగా మార్చుకునే విధానం ఉంది. చెత్త ద్వారా సంపద సృష్టించేందుకు అనేక కార్యక్రమాలు చేస్తున్నాం. గత ప్రభుత్వం శుభ్రతపై ఎప్పుడూ దృష్టి పెట్టలేదు. కృష్ణా, గోదావరి నదుల్లోకి, కాలువల్లోకి కలుషితమైన మురుగునీరు వదిలేస్తున్నారు. దీని ప్రభావం మనందరం అనుభవిస్తున్నాం. వాతావరణంలో పెను మార్పులు వచ్చాయి. రాష్ట్రంలో ఇవాళ్టికి 53 శాతం లోటు వర్షపాతం ఉంది. ప్రతి ఒక్కరూ స్వచ్ఛాంధ్రలో భాగస్వాములైతేనే స్వర్ణాంధ్ర ఫలితాలు వస్తాయి'' అని సీఎం అన్నారు. కార్యక్రమంలో మంత్రి నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ పాల్గొన్నారు.

## దేశ ప్రజలు కాంగ్రెస్ ముక్త్ భారత్ కోరుకుంటున్నారు

**కేంద్రమంత్రి బండి సంజయ్**



**ముద్ర, హైదరాబాద్** : దేశ ప్రజలు కాంగ్రెస్ ముక్త్ భారత్ కోరుకుంటున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా జమ్మికుంట గాంధీచౌక్‌లో మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. వారసత్వ రాజకీయాలకు మహాత్మా గాంధీ వ్యతిరేకమని, గాంధీ అసలైన వారసుడు ప్రధాని నరేంద్ర మోదీ, భాజపానే అన్నారు. ప్రస్తుతం ఉన్న ఇటలీ నేషనల్ కాంగ్రెస్ డూప్లికేట్ గాంధీ కుటుంబానిదేనని విమర్శించారు. రాబోయే రోజుల్లో గాంధీ వారసులుగా తెలంగాణ రాష్ట్రంలో రామరాజ్యం తీసుకొస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవుళ్ల పేరుతో హిందువులను చీల్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఖైరతాబాద్‌లో 32 వేల మంది ముస్లింలు ఉంటే కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందని ఆ పార్టీ నాయకులంటున్నారని, 2 లక్షల పైగా హిందువుల ఓట్లు ఉన్నాయనే విషయాన్ని మర్చిపోతున్నారన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటేనే అభివృద్ధి సాకారం అవుతుందన్నారు.

## మహిళల హాకీ జట్టుకు సీఎం రేవంత్ అభినందనలు

**ముద్ర, హైదరాబాద్** : 2026 ఆసియా క్రీడల్లో చైనాపై విజయం సాధించి బంగారు పతకం గెలుచుకున్న భారత మహిళల హాకీ జట్టుకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. 1982 తర్వాత ఆసియా క్రీడల్లో మహిళల హాకీ జట్టు స్వర్ణం సాధించడం, 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించడం అభినందనీయమన్నారు. జట్టు దృఢ సంకల్పంతో ఆడిన తీరు దేశంలోని క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఆసియా క్రీడల్లో భారత్ ఇప్పటికే 16 స్వర్ణాలతో 76 పతకాలు సాధించి ఐదో స్థానంలో ఉండటం గర్వించదగ్గ విషయమన్నారు.

## జాతీయ ఉషుకు తెలంగాణ విద్యార్థిని

**- వైష్ణవికి కమిషనర్ అభినందనలు**



**ముద్ర, హైదరాబాద్** : రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల పరిధిలోని నేదునూరు మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని బాత్క వైష్ణవి జాతీయ స్థాయి ఉషు పోటీలకు ఎంపికైంది. హైదరాబాద్ రెడ్ హిల్స్ లోని జీహెచ్ ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ' నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వైష్ణవి అద్భుత ప్రదర్శన కనబరిచింది. అండర్–17 విభాగంలో, 56 కిలోల కేటగిరీలో రాణించి జాతీయ స్థాయికి అర్హత సాధించింది. వైష్ణవి తండ్రి శ్రీశైలం క్రీడల్లో ఆమెను ప్రోత్సహిస్తూ ఈ స్థాయికి తీసుకురావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

**శ్రీనగర్‌లో జాతీయ ఛాంపియన్‌షిప్.. కమిషనర్ అభినందనలు**

ఈ నెల అక్టోబర్ 15 నుండి 19 వరకు జమ్మూ కాశ్మీర్ లోని శ్రీనగర్ వేదికగా జరగనున్న 70వ ఎస్ జీఎఫ్ (SGF) జాతీయ ఉషు ఛాంపియన్ షిప్ లో వైష్ణవి తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రతినిధిగా బరిలోకి దిగనుంది. జాతీయ స్థాయికి ఎంపికైన సందర్భంగా విద్యార్థినిని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ నవీన్ నికోలస్ ప్రత్యేకంగా అభినందించారు. శ్రీనగర్ లో జరిగే జాతీయ పోటీల్లోనూ ఇదే రకమైన ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి బంగారు పతకం సాధించి తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

## ఉపాధ్యాయుల స్థానికతను నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

**ముద్ర, అమరావతి:** రాష్ట్రంలో ఉపాధ్యాయుల స్థానికతను నిర్ణయిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు వారి సమాన కేడర్ ఉద్యోగులను రాష్ట్రపతి ఉత్తర్వులు 2025 ప్రకారం జిల్లా కేడర్ ఉద్యోగులుగా ప్రభుత్వం నిర్దేశించింది. మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే 23 రకాల టీచర్లను జిల్లా కేడర్‌లో ఉంచుతూ 202 జీవో విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే 27 రకాల టీచర్లను జిల్లా కేడర్‌గా నిర్ధారిస్తూ 201 జీవోను జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలలు, ఎంపీపీ, జడ్పీలలో పనిచేసే హెడ్ మాస్టర్ గ్రేడ్ –2 (గెజిటెడ్)ను జోనల్ కేడర్‌గా నిర్ధారించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో దాదాపు 70 వేల వరకు ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల కేడర్ తాజా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం నిర్ధారించినట్టయింది. సుమారు లక్ష మంది వరకు ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్లను కూడా జిల్లా లోకల్ కేడర్‌గా నిర్ధారించినట్టయింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

# మెట్రో, ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

- కామన్ పాస్ అందుబాటులోకి
- ఒకే పాస్‌తో మెట్రో, ఆర్టీసీ ప్రయాణం.. ధరలు ఇవే
- రోజువారీ, నెలవారీ కామన్ పాస్‌లు..
- హైదరాబాద్ ప్రజలకు సరికొత్త ట్రావెల్ సదుపాయం..
- మెట్రో-ఆర్టీసీ అనుసంధానించి పాస్‌ను ఆవిష్కరించిన భట్టి




**ముద్ర, హైదరాబాద్**: మెట్రో , ఆర్టీసీ కామన్ పాస్‌ను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు. క్యూర్ పరిధిలోని ప్రయాణికులకు సౌకర్యవంతమైన, నిరాటంకమైన ప్రజారవాణా అనుసంధానం కల్పించడమే లక్ష్యంగా ఆర్టీసీ, మెట్రో కలిసి కామన్ పాస్‌ను ప్రవేశపెట్టాయి. రోజువారీ, నెలవారీ పాస్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. రోజువారీ ఉమ్మడి పాస్ రూ.400గా నిర్ణయించారు. (మెట్రో ఛార్జీ రూ.300, ఆర్టీసీ ఛార్జీ రూ.100) నెలవారీ పాస్ రూ.8,500 (మెట్రో ఛార్జీ రూ.7,000, ఆర్టీసీ ఛార్జీ రూ.1,500)గా ధరను ఖరారు చేశారు. మొదటిసారి కొనుగోలు చేసేటప్పుడు కార్డు కోసం రూ.100 వసూలు చేస్తారు. కార్డును తిరిగి ఇచ్చినప్పుడు రూ.100 వాపసు చేస్తారు. ఒకే పాస్‌తో ఓఆర్ఆర్ లోపల నడిచే అన్ని రకాల ఆర్టీసీ సిటీబస్సుల్లో (పుష్పక్‌కు మినహా), మెట్రో రైళ్లలో ప్రయాణించవచ్చు.

## తల్లి కునుకు తీసింది..

## నీటి సంపులో పడి చిన్నారి మృతి



**ముద్ర, హైదరాబాద్** : చిన్నారిని నిద్రపుచ్చేందుకు జోలపాడుతూ ఆ తల్లి కూడా ఓ కునుకేయడం తీవ్ర విషాదాన్ని నింపిందింది. తల్లి ఒడిలోంచి లేచిన ఆ చిన్నారి పాక్కుంటూ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో పడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం కొనాయిగూడెంలో శుక్రవారం చోటుచేసుకుంది. కొనాయిగూడెం గ్రామానికి చెందిన ఒరుసు శ్రీను– మమత దంపతులకు ఇద్దరు పిల్లలు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో తల్లి మమత తన కుమారుడు స్టాలిన్ (11 నెలలు)కు జోలపాడుతూ పడుకోబెట్టింది. అదే సమయంలో నిద్ర ముంచుకు రావడంతో కొద్దిసేపు ఆమె కూడా కునుకు తీసింది. ఈ క్రమంలో చిన్నారి పాకుతూ బయటికి వచ్చి ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో పడి ప్రాణాలు కోల్పోయాడు. కొద్దిసేపటికి ఆ తల్లి లేచి చిన్నారి కోసం వెతకగా సంపులో తేలుతూ కనిపించాడు. లబోదిబోమంటూ భర్త శ్రీనుకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. కుమారుడిని కోల్పోవడంతో ఆ దంపతుల రోదన గ్రామస్థులను కలచివేసింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుర్రంపోడు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

## డిమాండ్స్ డే : చందానగర్ లో పోటెత్తిన కలం వీరులు

**చందానగర్ పిజేఆర్ స్టేడియంలో జాతిపితకు వినతి పత్రం**



**ముద్ర న్యూస్ బ్యూరో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా:** టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన వర్కింగ్ జర్నలిస్ట్ ల డిమాండ్స్ డే సందర్భంగా రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి నియోజకవర్గం పీజేఆర్ స్టేడియంలో కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున జరిపారు. రంగారెడ్డి జిల్లా యూనిట్– శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండ విజయకుమార్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీమ్ పాషా, జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. అంతకుముందు జర్నలిస్టుల సమస్యలపై నేతలు మాట్లాడారు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా, కార్యదర్శి మేకల సత్యనారాయణ లు మాట్లాడుతూ జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, అక్రిడిటేషన్ కార్డులు,బస్ పాసులు, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్క రించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి రక్షణ కల్పించాలని నాయకులు కోరారు. పనిచేసే జర్నలిస్ట్ లకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి,పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి జర్న లిస్టులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఆనంతుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు మాధవ్ రెడ్డి,ఏ భీమన్న, భాస్కర్, పాండు యాదవ్, సంయుక్త కార్యదర్శులు సత్యనారాయణ,సూర్య నారాయణ, ఆంజనే యులు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దర్పల్లి రవీందర్, నరసింహ రావు, కార్యదర్శి ఎండీ షకీల్,ఈసీ సభ్యులు దర్శనం జంగయ్య, ఇలియాజ్, ప్రణయ్ ముదిరాజ్, శేఖర్, కరుణాకర్, కృష్ణ,చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షులు యాదయ్య, షాద్ నగర్ నియోజకవర్గ ఎలాక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నర్సింహా, శేరిలింగంపల్లి నియోజకవర్గ యూనియన్ నేతలు నాగేష్, నరేష్, గోవర్ధన్ రెడ్డి, మల్లేష్, శంకర్, నాగారత్నం,ప్రభాకర్ మహేందర్,భూమేష్, మహేందర్, యాసీన్, ఫారుఖ్, ఖాజా, బస్వరాజ్, షారఫొద్దీన్,సతీష్, ఎలాక్ట్రానిక్ మీడియా కార్యదర్శి విజయ్,ప్రవీణ్, షఫీ,కలెక్టరెట్ రిపోర్టర్లు శ్రీనివాస్, మహేందర్, జిల్లాలోని వివిధ ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్,దామోదర్ రెడ్డి,రవీందర్, మల్లికార్జున్, జగన్, రాము యాదవ్, జిలానీ, జయంత్, మనోహర్, రమేష్,భాస్కర్, విష్ణు, మల్లికార్జున్,షాద్ నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, చేవెళ్ల, రాజేంద్ర నగర్, ఎల్ బీ నగర్, మహేశ్వరం నియోజకవర్గాలకు చెందిన జర్నలిస్టులో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేటితరం ఆదర్శ కమ్యూనిస్టు కొమ్మిడి లక్ష్మారెడ్డి

**జాన్ వెస్లీ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి...**





**వలిగొండ, ముద్ర:**నేటి తరం ఆదర్శ కమ్యూనిస్టుగా కోమ్మిడి లక్ష్మారెడ్డి నిలిచారని వారి ఆశయం వారి ఆదర్శం గొప్పదని చిన్నతనంలో పట్టిన ఎర్రజెండాను చివరి శ్వాస వరకు విడవకుండా బ్రతికిన గొప్ప నాయకుడని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ శాసనమండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు లు అన్నారు. శుక్రవారం రోజున మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో పులిగిల్ల మాజీ సర్పంచ్ కొమ్మిడి లక్ష్మారెడ్డి పార్థివ దేహం పై ఎర్రజెండా కప్పి పూలమాలవేసిన సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల స్ఫూర్తితో సిపిఎం పార్టీలో చేరి యువజన సంఘం నాయకుడిగా సిపిఎం నాయకునిగా పులిగిల్ల గ్రామానికి 20 సంవత్సరాల పాటు సర్పంచ్ గా నీతి నిజాయితీ నిస్వార్థంతో నిరంతరం పనిచేశారన్నారు ఒకవైపు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తూ మరొకవైపు పార్టీ నాయకునిగా మండల వ్యాప్త ఉద్యమ నిర్మాణం కోసం కృషి చేశాడన్నారు 20 సంవత్సరాల పాటు సర్పంచ్ గా పనిచేసిన ఎలాంటి హంగు ఆర్భాటాలకు తావు లేకుండా పనిచేస్తూ సమాజంలో దోపిడీ పీడనలు పోవాలని సమ సమాజం రావాలని ఆశించారు. కులము,మతము ప్రజల మధ్య వైశ్యామ్యాలు తప్ప అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడవని భావించాడని పేద,ధనిక తేడా లేకుండా కూలీలు,రైతులు, కార్మికుల పక్షాన పోరాటాలు మార్గమని నమ్మి జీవితాంతం కృషి చేశాడని అన్నారు . తన పేదరికం ప్రజల కోసం పోరాడే ఎర్ర జెండాకు ప్రజలకు అడ్డుకాకుండా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని ఉక్కు సంకల్పంతో ఎదిరించి పులిగిల్ల గ్రామంలో ఎర్రజెండాను నిలబెట్టాడని తాను ఏనాడు పదవుల కోసం పాకులాట లేదని యువతను ప్రోత్సహించడంలో వారిని పై కమిటీల్లోకి తీసుకపోవడం కోసం నిరంతరం శ్రమించాడని చెప్పారు. ఆయన జీవితాంతం పాటించిన ఆదర్శాలు, ఆశయాలను ముందుకు తీసుకుపోయేందుకు నేటి యువత ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి. జహంగీర్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి లు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా సిపిఎం పార్టీలో రామన్నపేట డివిజన్ కమిటీ సభ్యుడిగా, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యుడిగా,రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడిగా,ఉమ్మడి నల్గొండ జిల్లా కమిటీ సభ్యులుగా పనిచేశారన్నారు ఒకవైపు ప్రజా సమస్యలపై పనిచేస్తున్న సమయంలో సిపిఎం ఉద్యమాన్ని బలహీనపరిచేందుకు నక్సలైట్ల చేత నిర్బంధాన్ని ఎదుర్కొన్నాడని అనేక బెదిరింపులకు భయపడకుండా మొక్కవోని ధైర్యంతో గ్రామంలో మండలంలో మరిన్ని ప్రజా పోరాటాలను నిర్వహించి పులిగిల్ల గ్రామాన్ని సిపిఎం పార్టీకి కోటగా తయారు చేశారని అన్నారు గ్రామంలో మండలంలో ఏ ప్రజా సమస్య ఎదురైన వాటిని క్షుణంగా పరిశీలించి వాటిపై ప్రజా పోరాటాలు నిర్వహించడంలో ప్రజల్ని సమీకరించడంలో ఆయన పాత్ర కీలకమైనదని నేటికీ 80 సంవత్సరాల వయసులో కూడా పార్టీ కార్యక్రమాల్లో నిన్నటి వరకు పాల్గొని ఈరోజు ఆయన అకాల మరణం చెందడం సిపిఎం పార్టీకి మండల ఉద్యమానికి తీరని నష్టమని ఆయన ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళులని అన్నారు..

కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ బట్టుపల్లి అనురాధ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జల్లెల పెంటయ్య,బూరుగు కృష్ణారెడ్డి, దాసరి పాండు, పార్టీ మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య గణపతి రెడ్డి, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, దయ్యాల నరసింహ, గంగాదేవి సైదులు, బోలగాని జయరాములు, మధ్యపురం రాజు, రాగిరి కిష్టయ్య, గడ్డం వెంకటేష్, కోట రామచంద్రారెడ్డి,సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి,మేక అశోక్ రెడ్డి,కళ్లెం సుదర్శన్ రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు వాకిటి వెంకటరెడ్డి, తుర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం, కూర శ్రీనివాస్,కందడి సత్తిరెడ్డి,సిపిఎం శాఖ కార్యదర్శి మారబోయిన నరసింహ, సహాయ కార్యదర్శి వేముల నాగరాజు, సిపిఎం సీనియర్ నాయకులు, అనేకమంది కామ్రేడ్స్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in | @mudranews

శనివారం, 03 అక్టోబర్, 2026

4

వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com



## ఇవి తింటే 10 ఏళ్లు ఎక్కువగా జీవిస్తారు

మీరు ఆరోగ్యంగా ఉండాలంటే చాలా చర్యలు తీసుకోవాలి. ఉదయం లేవడం దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు ఎన్నో విషయాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. తినే ఫుడ్, వాటర్ అన్ని విషయాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. కొందరు వ్యాయామం చేస్తే మరికొందరు తమ ఆహారాన్ని మార్చుకుంటారు. మీరు ఎటువంటి ప్రయత్నం లేకుండా మిమ్మల్ని మీరు ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకుంటే, మీ రోజులో కచ్చితంగా పప్పు దినుసులు యాడ్ చేసుకోవాలి. మీరు ఆరోగ్యకరమైన అల్పాహారంతో పాటు లంచ్, డిన్నర్ విషయంలో కూడా జాగ్రత్త వహించాలి.

కచ్చితంగా మీ రోజులో కంది పప్పు, బొబ్బర్లు, చిక్కుల్లు, పెసల్లు, రాజ్మా, బ్రౌన్ రైస్, గోధుమలతో పాటు పల్లీలు, నట్స్ వంటి వాటిని చేర్చుకోవాలి అని సూచిస్తున్నారు నిపుణులు. వీటిని మీ డైలీ డైట్ లో చేర్చుకుంటే కచ్చితంగా మీ ఆయుష్షు పెరుగుతుందట. ఏకంగా పురుషులు 13 సంవత్సరాలు, మహిళలు 10.3 సంవత్సరాలు ఎక్కువగా బతుకుతారు అని చెబుతుంది గ్లోబల్ బర్డెన్. అంతేకాదు వీటితో పాటు చికెన్, మటన్ వంటివి తగ్గించాలి అని సూచిస్తుంది. ఇలా చేయడం వల్ల మీరు కొన్ని సంవత్సరాల పాటు ఎక్కువగా జీవిస్తారన్నమాట.

అయితే ఆహార సమస్యల వల్ల ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా కోటి పది లక్షల మంది చనిపోతున్నారట. అందుకే మీ డైట్ లో మంచి ఫుడ్ ను చేర్చుకోండి. పైన తెలిపిన పప్పు దినుసులు నట్స్ తీసుకోవడం వల్ల మీకు ఎలాంటి సమస్యలు రావు. ఇందులో ప్రోటీన్, నికోటిన్ ఆమ్లం, థయామిన్, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, ఖనిజాలు, ఇనుము, భాస్వరం వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మీకు చాలా ఉపయోగపడతాయి. ఆరోగ్యకరమైన కొవ్వు, ఫైబర్, ప్రోటీన్, విటమిన్ బి-6, థయామిన్ వంటి ముఖ్యమైన పోషకాలను ఉండటం వల్ల కంటి చూపు, మెదడు, స్కిన్, గుండె వంటి వాటికి ప్రయోజనం చేకూరుతుంది. మంచి పేగు ఆరోగ్యాన్ని కూడా కాపాడుతాయి. వీటిని తినడం వల్ల రాత్రిపూట మంచి నిద్ర వస్తుంది.

ఇక బాదం వంటి నట్స్ లలో ప్రోటీన్, ఫైబర్, విటమిన్ ఇ, కాల్షియం, రాగి, మెగ్నీషియం, రైబోఫ్లేవిన్, ఐరన్, పొటాషియం, జింక్, విటమిన్ బిలు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. రక్తపోటును నియంత్రిస్తాయి. ఇందులో కొన్నింటిని నానబెట్టి తింటే మరింత ఎక్కువ ప్రయోజనాలు చేకూరుతాయి. ఇలాంటి పప్పులు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. వాటిలో ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్లు, ఫైబర్ మంచి మొత్తంలో ఉంటాయి. ఇవి బరువు తగ్గడానికి, గుండె ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటాయి. అవిసె గింజలు వంటి సూపర్ ఫుడ్ కూడా మీకు చాలా మంచివి. వాటిని నానబెట్టి తినడం వల్ల లిగ్నన్స్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాల శోషణ మెరుగుపడుతుంది. ఇది కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

ఈ విత్తనాలలో జింక్, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి కండరాలు, ఎముకల ఆరోగ్యానికి ముఖ్యమైనవి. వీటిని నానబెట్టడం వల్ల జీర్ణం కావడం సులభం అవుతుంది. నానబెట్టిన నువ్వులు తినడం వల్ల శరీరంలో కాల్షియం, మెగ్నీషియం శోషణ పెరుగుతుంది. ఇది ఎముకలను బలోపేతం చేయడానికి, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

## అదీ మా తెలంగాణ కథ

నాటి తెలంగాణ పరిస్థితులు .నేటి యువతలో చాలా మందికి.. ఒకప్పటి తెలంగాణా చీకటి జీవితం ఇలా ఉండేదని తెలీదు. ప్రఖ్యాత రచయిత యండమూరి వీరేంద్రనాథ్ 'కాసనోవ -99' నవలలో నారాయణరెడ్డి, గుర్రం జాషువా లాంటి ప్రత్యక్ష సాక్షులను, ఇంకెందరో తెలంగాణ ఉద్యమ కారుల్ని సంప్రదించి. 3 నెలలు కష్టపడి విషయ సేకరణ చేసి తెలంగాణలో నిజాం పాలన గురించి ఓ భాగం రాశారు.




'నా తండ్రి పేరు చెంచయ్య, బోయి చెంచయ్య..! సూర్యాపేట దగ్గర చిన్న గ్రామం మాది. భారత దేశంలో స్వాతంత్ర్యోద్యమ పోరాటం జరుగుతోందన్న విషయం కూడా తెలియనంత చిన్న ఊరు మాది. ఆటోలు రాక ముందు సైకిల్ రిక్షాలు, ఇంకా కొంచెం వెనక్కి వెళితే 'మూడు చక్రాల బండి'ని మనుషులు చేతులతో లాగేవారు. దానికన్నా వెనక్కి వెళ్తే పల్లకీలు ఉండేవి. ఇప్పుడు నేను చెప్తున్నది అంతకన్నా వెనుక మీకు తెలియని చరిత్ర గురించి..! ఆ రోజుల్లో జాగీర్ధార్లనీ, దేశ్‌ముఖ్‌లనీ, పటేల్, పట్వారీలనీ ఒక చోట నుంచి మరొక చోటుకి చేర్చటానికి, మా తండ్రిలాటి వారిని 'జంతువుల్లా' ఉపయోగించేవారు. వెనుక వంది మాగధులు వెంట రాగా ఈ పటేళ్ళు 'బోయీ'ల భుజాల మీద ఎక్కి, అయిదారు మైళ్ళు ప్రయాణించే వాళ్ళు. బోయీలు మధ్యలో నీటి కోసం కూడా ఆగటానికి వీల్లేదు''.

'..నాకొక అన్నయ్య, చెల్లి ఉండేవారు. ఆ రోజుల్లో ఈ 'దాసి' సిస్టమ్ చాలా కఠినంగా అమలులో ఉండేది. సూర్యాపేట్ దేశముఖ్ కూతురి పెళ్ళికి మా పిన్నిని 'దాసి'గా పంపవలసి వచ్చింది. దాసీ అంటే పెళ్ళికూతురుతో పాటు, ఈ అమ్మాయి కూడా అత్తవారింటికి భరణంగా వెళ్ళి, అక్కడ కొత్త పెళ్ళికూతురుకి జీవితాంతం సేవ చేస్తూ, ఆ ఇంట్లో మొగవారికి ఉంపుడుకత్తెగా ఉండాలి. ఇదీ అప్పటి ఆచారం. ఇదిగాక 'వెట్టి' అని ఉండేది. ప్రతి హరిజన కుటుంబం నుంచి ఒక కుర్రవాడిని జమిందారు ఇంటికి 'వెట్టి' కోసం తప్పనిసరిగా పంపాలి. మా పిన్ని వెళ్ళిన కొన్నిరోజులకి మా అన్న 'వెట్టి' కోసం పట్వారీ దగ్గరికి వెళ్ళిపోయాడు''.

అప్పుడు తెలంగాణ ప్రాంతం నిజాం ఆధీనంలో ఉంది. తెలుగు, కన్నడ, మరాఠీలాటి మాతృభాషల్ని బోధించాలంటే స్కూలు యాజమాన్యం, ఉర్దూ అధికారుల్నుంచి 'ప్రత్యేక పర్మిషన్' తీసుకోవాలి. 90 శాతం హిందువుల మీద పదిశాతం ముస్లిమ్‌లు ఆ విధంగా అధికారం చెలాయించేవారు..! అదీ అప్పటి పరిస్థితి..! కమ్మర్లు, కుమ్మర్లు, రజకులు, బోయలు, బెస్తలు - అందరూ ఈ పట్వారీల ఇళ్ళల్లో ఉచితంగా పనిచేయాలి. గీత పనివారు, వారి కుటుంబాలకి రోజూ ఉచితంగా కల్లు సప్లయి చేయాలి. బట్టలు ఉతకడం- కుండలు సప్లయి చేయటం- అంతా ఉచితమే.

ఈ పట్వారీలు గుర్రాల మీద గానీ, మేనాల్లోగానీ వేరే ఊర్లో ఉన్న బంధువుల ఇళ్ళకి ప్రయాణం చేయవలసి వస్తే, మేమంతా ఈ ఊరి నుంచి ఆ ఊరివరకూ ఆ బళ్ళ ముందూ, వెనుకా కొన్ని మైళ్ళు దారిని 'క్లియర్' చేస్తూ గట్టి గా అరుచుకుంటూ పరుగెత్తుతూ వెళ్ళాలి. దాన్ని వ్యతిరేకిస్తే వంద కొరడాదెబ్బలు..!

'సారఖాస్' అని ఒక సిస్టమ్ ఉండేది. హైద్రాబాద్ రాష్ట్రంలో అయిదుకోట్ల ముప్పై లక్షల ఎకరాలలో పంటలు పండేవి. అందులో అయిదులక్షల ఎకరాల మీద వచ్చే ఆదాయం కేవలం నైజాం నవాబు ఖర్చులకీ, విందులూ వినోదాలకీ, భార్యల- ఉంపుడుకత్తెల నిర్వాహణకి వినియోగించేవారు..! నవాబుకి విశ్వాసపాత్రులయిన దేశ్‌ముఖ్‌లు మమ్మల్ని నిరంకుశులుగా పాలించేవారు. మా కుటుంబాల్లో ఎవరికైనా కాస్త భూమి ఉంటే, విత్తనాలు, నాగళ్ళకి వీరు ధన సహాయం చేసేవారు. పంట చేతికి రాగానే వడ్డీ రూపేణా మొత్తం తోలుకు వెళ్ళి పోయేవారు. ఆ తరువాత "అసలు" రూపేణా పొలాన్ని తమ పొలంలో కలిపి వేసుకునేవారు. ఆ విధంగా 'తిరిగి' మళ్ళీ మా కుటుంబం వెట్టి జాబితాలో చేరి పోయేది..! తన భూమిలోనే తను కూలీగా పనిచేయవలసి వచ్చేది..!

జానారెడ్డి ప్రతాపరెడ్డి అనే దేశ్‌ముఖ్ ఒక్కడికే సూర్యాపేట పరిసర ప్రాంతాల్లో 1,50,000 ఎకరాల పొలం ఉండేది. మా తండ్రి అక్కడే పని చేసేవాడు.మాలో ఎవరయినా కొద్దిగా ఎదురు తిరిగినా- పట్వారీలు పిలిపించేవారు. అశుద్ధం తినిపించేవారు. మూత్రం తాగించేవారు. తలక్రిందులుగా వ్రేలాడదీసేవారు..! మా జీవితమంతా చీకటే. పట్వారీ- మా కుటుంబంలోంచి కుర్రవాడిని వెట్టి కోసం ఏ క్షణం స్వంతం చేసుకుంటాడో తెలీదు. ఏ క్షణం దేశ్‌ముఖ్- మా కుటుంబంలోని ఒక ముక్కుపచ్చలారని అమ్మాయిని భరణంగా స్వీకరిస్తాడో తెలీదు. మా జీవితమంతా భయమే. కదుల్తున్న అస్థిపంజరాల్లా బ్రతికేవాళ్ళం. భవిష్యత్తు పట్ల అంధకారంలో, జీవితం పట్ల భయంతో... వారి సేవలో గడపటమే మేము చేసుకున్న పుణ్యం అన్నట్లు.. మోసగింపబడటమే మా జీవితంలో భాగం అన్నట్లు జీవచ్ఛవాల్లా బ్రతికేవాళ్ళం. సరిగ్గా ఆ సమయంలో వచ్చింది- ''తెలంగాణా సాయుధ పోరాటం...!' తెలంగాణ అంతా ఉద్యమం ప్రారంభమైంది. కల్లు శిస్తు నిరాకరణ నుంచి- అధిక భూముల పంపకం వరకూ 'దళాలు' చేపట్టాయి. మాతండ్రి బోయి చెంచయ్య, సూర్యాపేట తాలూక జాజిరెడ్డి గూడెంకి స్క్వాడ్‌లీడర్ అయ్యాడు. మల్కాపురం, గోరంట్లలలో చిన్నగా ప్రారంభమైన ఉద్యమం ఆదిలాబాదు, భద్రాచలం వరకూ పాకింది. 20 ఎకరాలు 'లాండ్ సిలింగ్'గా కమ్యూనిస్ట్ పార్టీ ఆంక్షలు విధించింది. అంతకన్నా ఎక్కువ ఉంచుకో కూడదని మా దళాలు హెచ్చరించాయి.

తెలంగాణ భూస్వాముల, దొరల గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. వెళ్ళి నిజాం నవాబుని శరణుజొచ్చారు. నైజాం నవాబుతో కలిసి న్యాయాన్యాయాల్ని పక్కన పెట్టి ఒక సైన్యాన్ని తయారు చేశారు. వారికి సర్వాధికారాలూ ఇచ్చాడు నవాబు. ఎదురు తిరిగిన వాడిని అక్కడికక్కడే కాల్చేందుకు రైఫిల్స్ ఇచ్చాడు. గృహ దహనాలు, లూటీలు, మానభంగాలు ఒకటేమిటి? దేనికయినా సరే, వారిని ప్రశ్నించేవారు లేరు. అటువంటి అధికారాలతో ఆ ముస్లిం గూండాలు తెలంగాణ పైకి విరుచుకుపడ్డారు. వారే రజాకార్లు..'

"రజాకార్లు జీపుల్లోనూ, గుర్రాలపైనా వస్తుంటే- గ్రామాలకి గ్రామాలు నిముషాల్లో ఖాళీ అయి పోయేవి. హిందువులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని పరుగెత్తేవారు. అటకల పైకెక్కి దాక్కునేవారు. రజాకార్లు హిందూ స్త్రీల స్తనాల్నీ, ఆవు పొదుగుల్నీ కత్తిరించే వారు. పల్లె ప్రజల ఆస్తుల్ని, ఆహార ధాన్యాల్నీ- చివరికి కందిపప్పు, మినపప్పుతో సహా రజాకార్లు దోచుకు పోయేవారు. గ్రామాల్ని తగులబెట్టేవారు. నెలల తరబడి క్యాంపువేసి కోళ్ళు, మేకలు, విందులు- వినోదాలు ఒకటేమిటి- వారి ఆనందానికి, అరాచకానికీ అడ్డుండేది కాదు. ఆడది కనపడితే చాలు. ఆమె భర్తే స్వయంగా తీసుకెళ్ళి వారి క్యాంపుల్లో అర్పించాల్సిందే...!

ఆ సమయంలో మా తండ్రిలాంటి సాయుధ దళాధిపతులు కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లిం రజాకార్లని ఎదుర్కొన్నారు. దేశ్‌ముఖ్‌లనీ, పట్వారీలనీ భుజాలపై మోసుకుంటూ మైళ్ళకి మైళ్లు నడిచిన చేతులు, స్త్రీలనీ పీడిత ప్రజల్నీ రక్షించడం కోసం రైఫిళ్ళని పట్టుకుని నడుం కట్టాయి. బోయి చెంచయ్య అంటే సూర్యాపేట తాలూకాలో తెలియనివారు లేరు''.''...

అనుకున్నట్టుగానే, ఇండియాకి స్వతంత్రం రాగానే నిజాంనవాబు హైద్రాబాద్‌ని స్వతంత్ర దేశంగా ప్రకటించాడు. పాకిస్తాన్ నుంచి సైన్యం వచ్చి తమ దేశాన్నీ, దేశంలోని ముస్లిమ్‌లనీ కాపాడుతుందని అనుకున్నాడు. కానీ అతడొక విషయం మర్చిపోయాడు. రజాకార్లతో చేరి హిందువులపై భీభత్సం సృష్టిస్తూన్న ముస్లిమ్ ఛాందస వాదుల కన్నా- మాతో ఉండి పోరాడుతున్న బీద "ముస్లిమ్" గ్రామీణులే ఎక్కువ. ఆ విధంగా మా పోరాటం కొనసాగింది. ఈ లోపు భారత సైన్యం బయల్దేరిందని తెలిసింది. అందరం నృత్యాలు చేసాం. మా రక్తంతో తడిసిన తెలంగాణా మట్టి, మాకు శాశ్వతంగా సొంతంగా మిగిలి పోబోతుందన్న సంతోషంతో చిందులు తొక్కాం.

సెప్టెంబర్ 13, 1948.. అటు భారత సైన్యం ఢిల్లీ నుంచి బయల్దేరి వరంగల్ వస్తోంది. ఇటు హైద్రాబాద్ నుంచి రజాకార్ల సైన్యం ఆలేరు, భువనగిరి, ఖమ్మం రైల్వే స్టేషన్లని మరింత బలపర్చి, స్వాధీనంలో ఉంచుకోవటం కోసం బయల్దేరింది. మా దళాలు రైలు పట్టాలు తొలగించాయి. రోడ్డు దారిన రజాకార్లు ఆ ప్రాంతాలకు చేరుకోకుండా ''ఆరునూళ్ళ తట్టపార-మూడు నూర్ల గడ్డపార'' అని పాడుతూ రోడ్డుకి అడ్డంగా గుంటలు తవ్వటం ప్రారంభించాయి. 'రజాకార్లని ఆపటానికి మూడొందల గునపాలూ, ఆరొందల తట్టలూ చాలు'- అన్న ఆ పాట ఆ రోజుల్లో ఎంతో ప్రసిద్ధమైంది.

భారత సైన్యం వచ్చేస్తుందన్న సంతోషంలో మేము కాస్త ఆదమరచి ఉండగా ఒక దురదృష్టకరమైన సంఘటన జరిగింది. రజాకార్లు హైద్రాబాద్ నుంచి వరంగల్ వైపు వాహనాలు వెళ్ళకుండా యాదగిరిగుట్ట దగ్గర గుడిపూజారి వేషంలో మేకులు జల్లుతూన్న నా తండ్రి రజాకార్లకి దొరికిపోయాడు. బోయి చెంచయ్య పట్టుబడిన విషయం తెలియగానే జనం ప్రాణభయం కూడా పక్కన పెట్టి పరుగెత్తుకు వచ్చారు.

నాకపుడు నిండా ఇరవై ఏళ్ళు కూడా లేవు. నేనాయన కొడుకునని రజాకార్లకి తెలియదు. చెల్లి మాత్రం దొరికిపోయింది. మమ్మల్నందర్నీ వలయంగా నిలబెట్టారు. రోడ్డుకి అడ్డంగా మా తండ్రి తవ్విన గుంటలోనే ఆయన్ని మెడవరకూ పాతిపెట్టారు. నేలలో మేకులు కొట్టి, మొహానికి ఆకాశం కనపడేలా జుట్టు గట్టిగా బిగించారు. కళ్ళు మూసుకోవటానికి వీల్లేకుండా కనురెప్ప కత్తిరించి, రక్తం తొందరగా గడ్డ కట్టటానికి వాటిపై మూత్రం పోశారు. ఆ తరువాత ఆయన మొహం మీద నులక మంచం వేసి, దుప్పటి లేకుండా పదిమంది రజాకార్లు మా చెల్లిని ఆ మంచం మీద రేప్ చేశారు. మేమందరం నిశ్శబ్దంగా ప్రేక్షకుల్లా చూస్తూ నిలబడ్డాం... మాతండ్రితో సహా...''

"భారత సైన్యం వస్తోందిరా..! నిజాం రజాకార్లు ఓడిపోక తప్పదు'' అంటూ నాతండ్రి చివరి శ్వాస తీసుకున్నాడు. అనుకున్నట్టుగానే భారత సైన్యం దిగింది. విమానాల దాడులతో హైద్రాబాద్ చుట్టుప్రక్కల ప్రాంతం దద్దరిల్లింది. తెలంగాణా ప్రజలు రజాకార్లని తరిమికొట్టారు. 1948 సెప్టెంబర్ 18న నిజాం నవాబు లొంగిపోయాడు. సూర్యాపేటలో నూట ఇరవై ఎకరాల స్థలంలో, నైజాం పాలెస్ కన్నా పెద్దదయిన జానారెడ్డి ప్రతాపరెడ్డి భవంతి కూడా మిగలకుండా కూలగొట్టబడింది. అక్కడ రెండువేల బస్తాల ధాన్యం దొరికిందంటే మీరే ఊహించుకోవచ్చు. తెలంగాణా రైతు కూలీలు విజయానికి గుర్తుగా మధ్యలో చిన్న సమాధి వదిలిపెట్టి, మిగతా స్థలాన్ని పొలంగా మార్చారు. ఎక్కడ చూసినా జనప్రవాహమే. జండాలు పట్టుకుని, పాటలు పాడుతూ, కదం తొక్కుతూ ఆనందాన్ని ప్రకటించారు. అదీ మా తెలంగాణా కథ''( నేటితరం వారికొరకు)

## ఎదిగే వారిపై అసూయపడకు

మనకు ఉండే చెడు గుణాలలో 'అసూయ' కూడా ఒకటి. మనకు దగ్గరి వారు ఉన్నత స్థానంలో ఉన్నా, మనం పనిచేసే ఆఫీసులోనో, మన ఇంటి పక్కనో, మన బంధువులలోనో ఎవరైనా పైస్థాయికి ఎదుగుతూ ఉంటే అతడిని /ఆమెను క్రిందికి ఎలా లాగాలా అని చూసే కళ్ళు దజన్ల కొద్దీ ఉంటాయి. ఇదంతా ఎందుకు. ఎదిగిన వ్యక్తి ఎలా ఎదిగాడు. వాటికి కారణాలు ఏమిటి అతడి నుండి మనం ఏం ప్రేరణ పొందుతున్నాం అని ఆలోచించకుండా ఎప్పుడు క్రిందకు గుంజాలా అని చూడటమే పనిగా పెట్టుకుంటారు.అలాంటి వారు జీవితంలో ఎదగరు.

ఎందుకంటే వారి కళ్ళముందే ఓ వ్యక్తి ఎదుగుతూ ఉంటే సహించలేనివారు, వారు స్వయంగా ఎదగటానికి ఎలాంటి ప్రణాళికలు రచించుకుంటారు చెప్పండి. వారి ఆలోచన మొత్తం వారి గురించి కాదు. వారి కళ్ళముందు ఎదుగుతున్న వ్యక్తి పతనాన్ని కళ్ళారా చూసి ఆనందించాలని (Ego satisfaction) వేయి కళ్ళతో నిరీక్షిస్తూ ఉంటారు. ఒకవేళ వారు ఊహించినదే జరిగితే అప్పుడు వారి 'అహం' సంతృప్తి చెందుతుంది. ఇది ఓ రకమైన మానసిక వ్యాధిగానే (Mental disorder) పరిగణించాలి. మనతో ఎవరైనా ప్రయాణం చేస్తే వారికి ఎద్దైనా కావాల్సి వస్తే "సహాయం" చేయమా? మరి అలా చేయకపోయినా ఎదుటి వారు పతనం కావాలని కోరుకునేవారు మానసిక రోగులు కాకపోతే ఏమిటి? ఒకవేళ మీకు అలాంటి ఆలోచనలు ఉంటే విరమించుకోండి. అలాంటి వారి కోసమే ఈ చిన్న కథను చదవండి.






డా. మహ్మద్ హసేన్
అసిస్టెంట్ ప్రొఫెసర్
9908059234

మనస్తత్వ శాస్త్రంలో (సైకాలజీ) ఓ భయంకర నియమం ఉంది. సామూహిక (Diderot effect) విధ్వంసం. మనకు అర్థం అయ్యే భాషలో చెప్పాలంటే తాచెడ్డ కోతీ వనమంతా తగుల బెట్టినట్లు. మానవ స్వభావం ఎంత భయకరంగా ఉంటుందో ఈ కథ మనకు తెలియజేస్తుంది.

ఒక అడవిలో ఒక చెట్టు కొమ్మకు చనిపోయిన జింక శరీరం వేలాడుతూ ఉంటుంది. దాని వాసన పసిగట్టిన హైనాలు దాని పరిసరాల్లోకి చేరి చనిపోయిన జింకను ఎలా చేరుకోవాలా అని అటూ ఇటూ పచార్లు కొడుతూ ఉన్నాయి. కానీ ఆ సమూహంలో ఏది కూడా జింకను చేరుకోలేకపోతున్నాయి. కారణం చెట్టు కొమ్మ హైనాలకు అందకుండా ఉండటమే. అప్పుడే ఓ హైనా తన తోటి హైనా వీపు పైకి ఎక్కి అమాంతం గాల్లోకి ఎగిరి 68 జింక మాంసం ముక్కను తన పదునైన పళ్ళతో లాగి క్షణాల్లో మింగేసింది. క్షణాల్లో జరిగిన ఈ సంఘటనను చూసిన మిగతా "హైనాలు" దాని పట్ల "అసూయ" (Jealousy)తో మేమంతా అకలితో ఉండగా నువ్వు ఒక్కడివే తింటావా అని వాటికనిపించి మరుక్షణమే హైనాల గుంపు దానిపై దాడి చేసి దానిని నిర్దయగా చీల్చివేశాయి. దాని మెడను నమిలి కాలిని విరిచివేశాయి. దాని ప్రాణం పోయేంత వరకు వాటి కోపం శాంతించలేదు. ఇప్పుడు అన్నీ సంతృప్తిగా ఉన్నాయి. ఎందుకంటే "సమూహాన్ని" కాదని జింక మాంసాన్ని తిన్న "హైనా" మిగతా వాటి దాడిలో చనిపోయింది. కారణం వాటికి మాంసం దొరకలేదు.

ఈ క్రమంలో ఒక సింహం అక్కడికి వచ్చింది. అది ఒక్క ఉదుటన జింక మృత శరీరాన్ని చెట్టుపై నుండి క్రిందికిలాగి హాయిగా తినసాగింది. అంతకు ముందే తమ తోటివాడిని చీల్చుకు తిన్న తోటి హైనాలు వెంటనే భయపడి వెనక్కి తగ్గాయి. సింహం ముందుకు వెళ్ళడానికి సాహసించలేదు. ఇదే మానవ నైజంలో అత్యంత క్రూరమైన నిజం (Cruel Factor) మీరు కొద్దిగా ఎదిగినా మీ తోటి వారు, మీ రక్త సంబంధీకులు, మీ ఇరుగు పొరుగు వారు, మీ పరిసరాలలోని ఆఫీసు సిబ్బంది ఇలా ఎవరైనా కావొచ్చు. వారిలో అసూయతో కూడిన బీజాలు మొలకలు వేస్తాయి. వాళ్ళకంటే కొంచెం ఎక్కువ సంపాదించినా పైస్థాయిలో ఉన్నా అది వారి "అసూయ" (Jealousy))కి కారణమవుతుంది. కానీ మీరు వారిని వారి ఉద్దేశాలను, నెగిటివ్ మాటలను, విమర్శలను పట్టించుకోకుండా ముందుకు సాగితే అప్పుడు వారు అసూయను వదిలి మిమ్మల్ని పొగడటం ప్రారంభిస్తారు. అందుకే మిత్రులారా స్వార్థంతో ముందుకు వెళ్ళే హైనాల మాదిరిగా ఉండకండి. మీరు కావాలనుకుంటే మీ బలాన్ని చూపి ఎవరూ మీకు ఎదురు నిలబడటానికి సాహసించని "సింహం"లా ఉండాలి.

బహుశా ఈ కథను నేను ఇంతకన్న ఎక్కువ విశ్లేషించదల్చుకోలేదు. ఇందులో అర్థంకాని లోతైన విషయం ఏమీలేదు. నిత్యం మనం ఇలాంటివి ఎన్నో చూస్తూ ఉంటాం. అసూయ అంటే పక్కోడి కొవ్వొత్తి వెలుగుతుంటే నీ కొవ్వొత్తి ఆరిపోయినట్టు ఫీల్ అవ్వడం. నిజానికి వారి వెలుగు వల్ల మీ వెలుగు తగ్గదు. "అసూయ" ఉన్న వాడి ఆయుష్షు తగ్గిపోతుంది. విషం తాగినట్టే ఎప్పుడూ కుమిలిపోతూ, సుఖం లేకుండా బ్రతుకుతాడు. అందుకే భర్తృహరి చక్కని పద్యంలో "పరుల శుభము జూచి పరితపించెడువాడు. ధరణిలోన వాడు దరిద్రుడగును పరుల కీడు కోరు పాపాత్ముడెప్పుడు మరణ వేదనలను మరుగకుండు" అంటాడు. అసూయ వల్లనే ధుర్యోధనుడు అధోగతి పాలు అయ్యాడు. మందర మాటలు విని కైక రాముడి పట్టాభిషేకం మీద "అసూయ" పడింది. రాముడి వనవాసం కోరింది. ఫలితం భర్త దశరథుడి మరణం. కొడుకు భరతుడు తల్లిని (కైకను) తిట్టడంతో (దూషించటం) జీవితాంతం అపకీర్తినిమూటగట్టుకుంది. అలాగే రావణుడు సీత నాకు దక్కనిది రాముడికి దక్క కూడదని "అసూయ" చెందాడు ఫలితం మీకు తెలుసు.

అలాగే శకుని, కర్ణుడు, ధృతరాష్ట్రుడు, హిరణ్యకశపుడు, శిశుపాలుడు (విశ్వామిత్రుడు- వశిష్టుడి మీద అసూయ పడతాడు) సత్రాజిత్తు ఇలా ఎందరో అసూయపడి అధోగతి పాలైనారు. కాబట్టి అసూయపడితే మీరు ఎక్కడున్నారో అక్కడే ఆగిపోతారు. పైగా ఉన్నది కూడా పోతుంది. అందుకే ఎవరి మీద "అసూయ" చెందకండి మీరు ఎలా ఎదగాలో ప్రణాళికలు రచించుకోండి. అసూయ పడినంత మాత్రాన సింహం నక్కలా మారదు పిల్లి పులిలా మారదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే పరుల సొమ్ము "పాము" వంటిది. అసూయ పడటం అంటే పాముని కావాలని నెత్తిన పెట్టుకోవడమే. కాబట్టి పక్క వాళ్ళ సంపద చూసి ఓర్వలేక ఏడ్చే ధుర్మార్గుడు బతకగలడా? చెట్టు నీడ పక్కన ఉన్న చెట్టుకి తగిలితే ఆ చెట్టు కరిగి పోతుందా? లేదు కదా! "అసూయ" వల్ల మీకే నష్టం, ఎదుటి వారికి కాదని గమనించండి.

ఈ వ్యాసం ఇటీవలే వచ్చిన 'మిమ్మల్ని మీరు తెలుసుకోండి' వ్యక్తిత్వ వికాసం పుస్తకం నుండి..

**కాకరకాయను ఆహారంలో చేర్చండి**

కాకరకాయలో ఫోలేట్, పొటాషియం, వివిధ ప్లాంట్ కాంపౌండ్స్ ఉంటాయి. సమతుల్య ఆహారంలో భాగంగా దీనిని తీసుకోవచ్చు.



# గాంధీజీకి ఘన నివాళులు

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** ప్రపంచానికి అహింస అనే ఆయుధాన్ని అందించిన జాతిపిత మహాత్మా గాంధీ 157 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. లంగర్ హౌస్ బాపుఘాట్లు జరిగిన జయంతి వేడుక ల్లో జాతిపిత మహాత్మాకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిలు నివాళులు అర్పించారు. బాపూఘాట్ లో బాపు సమాధి వద్ద పుష్పగుచ్చాలు ఉంచి ప్రత్యేక నివాళుల ర్పించిన రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ .రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మొహమ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ సలహాదారులు వి హనుమం తరావు, ప్రభుత్వ విప్ లు అద్దంకి దయాకర్, రామచంద్ర నాయక్, స్టేట్ తెలంగాణ స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్ పర్సన్ గద్దాల విజయలక్ష్మి, శాసనసభ్యులు నవీన్ యాదవ్, మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా బాపూ ధ్యాన మందిరం ఆవరణలో మరోసారి అభివృద్ధి చేసిన మహాత్మా గాంధీ డిజిటల్ మ్యూజియంను ప్రారంభించి పలు ప్రాంతాలను తిలకించారు.అనంతరం బాపు ధ్యాన మందిరం లో ఏర్పాటు చేసిన సర్వమత ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.తదుపరి బాపు ఘాట్ ఆవరణలో గల బాపు విగ్రహానికి పూలమాల వేసి, మౌనం పాటించి నివాళులర్పించిన గవర్నర్, సి. ఎం, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మొహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ విప్ లు అద్దంకి దయాకర్, రామచంద్రనాయక్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, శాసన సభ్యులు నవీన్ యాదవ్, మాజీ పార్లమెంట్ సభ్యులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డిజిపి సి.వి ఆనంద్, సిపి సజ్జనార్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్,పర్యా టకశాఖ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, డిసిపి గోల్కొండ జోన్ రాఘవేందర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.










**కూకట్‌పల్లిలో..**

**ముద్ర కూకట్‌పల్లి:** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని మూసాపేట్, ఉమ్మడి అల్లాపూర్, గాయత్రీ నగర్, కేపీహెచ్‌బీ రోడ్ నంబర్-1 తదితర డివిజన్లలో ఉన్న గాంధీజీ విగ్రహాలకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సేవా మార్గాలు నేటి సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన చేసిన మహోన్నత త్యాగాలను స్మరించుకుంటూ, గాంధీజీ కలలు కన్న సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.సంబంధిత డివిజన్ అధ్యక్షుల నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నేతలు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**టీపీసీసీ జనరల్ సెక్రటరీ పృథ్వీ చౌదరి నివాళి**

**ముద్ర, హైదరాబాద్:** గాంధీ జయంతి సందర్భంగా టీపీసీసీ జనరల్ సెక్రెటరీ పృథ్వీ చౌదరి మహాత్మా గాంధీకి ఘన నివా ళులర్పించారు. ఎల్బీనగర్‌లోని సహారా ఎస్టేట్స్‌లో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సీతారాములు, హైదరాబాద్ మార్కెట్ కమిటీ బుద్ధ సత్యనారాయణ, పోచబోయిన సురేష్ యాదవ్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణ యాదవ్, రమేష్‌తో పాటు వివిధ కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

**చేవెళ్లలో..**

**ముద్ర, చేవెళ్ల :** నియోజకవర్గం కేంద్రం, అన్ని మండలాలు, గ్రామాల్లో గాంధీ జయంతి ని శుక్రవారం నిర్వహించారు. చేవెళ్లలో ఎమ్మెల్యే యాదయ్య గాంధీ చిత్రప టానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. జాతిపిత మహాత్మా గాంధీ సేవలను కొనియాడారు. శంకర్ పల్లి పురపాలిక కార్యాలయం, వ్యవసాయ మార్కెట్ కార్యాలయాల్లో గాంధీ జయంతి ని నిర్వహించారు. కార్యక్రమం లో చేవెళ్ల పురపాలిక చైర్ పర్సన్ సమత, శంకర్ పల్లి వైస్ చైర్మన్ శ్వేత, కమిషనర్ యోగేష్, విపని చైర్మన్ గోవిందమ్మ, వైస్ చైర్మన్ మోహన్, కౌన్సిలర్లు నాయకులు గోపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శైలజ, అగిరెడ్డి, ఆనంద్, విజయ్, పాండురంగారెడ్డి, గణేష్, శ్రీనివాస్, మధుసూదన్, అశోక్ పాల్గొన్నారు.

# ఆ చిన్నారి వల్లనే ప్రయాణికులు బయటపడ్డారు

**ముద్ర, న్యూఢిల్లీ:** ఫ్లైదుబాయ్ విమానంలో ప్రయాణించిన ఆరేళ్ల చిన్నారి టాయిలెట్‌కు వెళ్లడం, భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో పాటు ఇతర ప్రయాణికుల ప్రాణాలను కాపాడింది. కాక్‌పిట్‌లో రక్తసిక్తంగా పడి ఉన్న భారత కెప్టెన్ స్మిత్ పరిస్థితిని గమనించిన ఆ బాలిక తన తండ్రిని అలెర్ట్ చేసి ఎంతో సహాయం చేసింది. సెప్టెంబర్ 30న ఫ్లైదుబాయ్‌కు చెందిన విమానం 174 మంది ప్రయాణి కులతో దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు బయలుదేరింది. ఆ విమానం 30,000 అడుగుల ఎత్తులో ఎగురుతుండగా ఒమన్ దేశస్థుడైన కో-పైలట్ హైజాకింగ్ ప్రయత్నం చేశాడు. భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై పదునైన ఆయుధంతో దాడి చేశాడు. ఎక్కువ మంది ఇజ్రాయెల్ ప్రయాణికులు ఉన్న ఆ విమానాన్ని కూల్చివేసేందుకు అతడు ప్రయత్నించాడు. కాగా, ఇజ్రాయెల్‌కు చెందిన ఆరేళ్ల నీనా తన తండ్రితో కలిసి ఆ విమానంలో ప్రయాణించింది. కాక్‌పిట్‌లో దాడి జరుగుతున్న సమయంలో ఆ బాలిక టాయిలెట్‌కు వెళ్లింది. కాక్‌పిట్ నుండి అరుపులు వినిపిం చడంతో ఆ చిన్నారి ఆందోళన చెందింది. టాయిలెట్ నుంచి బయటకు వచ్చిన ఆ బాలిక, కత్తిపోట్లతో రక్తసి క్తమైన భారత పైలట్ స్మిత్ మచ్చర్ కాక్‌పిట్ నుంచి తూలుతూ బయటకు రావడాన్ని చూసింది. కత్తితో దాడి చేసిన ఒమన్ కో-పైలట్‌తో ఆయన పెనుగులాడటం చూసి ఆ చిన్నారి భయాందోళన చెందింది. ఆ బాలిక గట్టిగా పిలువడంతో ముందు వరుసలో కూర్చొన్న ఆమె తండ్రి పరుగున అక్కడకు వెళ్లాడు. 'నాన్నా, మనం చనిపోవాలను కోవడం లేదు' అని ఆమె అన్నది.మరోవైపు ఇది విన్న ఆ వ్యక్తి వెంటనే స్పందించాడు. వేగంగా కాక్‌పిట్ వైపు వెళ్లాడు. అక్కడి పరిస్థితి చూసి ఇతర ప్రయాణికులను అప్రమత్తం




చేశాడు. దీంతో మరో ఇద్దరు ప్రయాణికులైన అసఫ్ రాజువాన్, యానివ్ హయూన్ వెంటనే కాక్‌పిట్ వద్దకు చేరుకున్నారు. భారత పైలట్ స్మిత్‌పై కత్తితో దాడి చేసిన కో పైలట్‌ను అడ్డుకున్నారు. విమానంలోని హెడ్‌ఫోన్ సెట్ కేబుళ్లతో అతడ్ని కట్టేసి అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో దంత వైద్యుడైన డాక్టర్ షోటా ముసయేవ్, గాయపడిన భారత కెప్టెన్ మచ్చర్‌కు ప్రాథమిక చికిత్స అందించారు. రక్తస్రావాన్ని ఆపి ఆయన పరిస్థితిని స్థిరంగా ఉంచడంపై దృష్టిసారించారు.అయితే ఆ విమానం వేగంగా ఎత్తు కోల్పోవడంతో ప్రయాణికులు భయందోళనతో కేకలు వేశారు. కొందరు తమ సీట్ల నుంచి ఎగిరిపడ్డారు. విమానయాన కార్యక్రమాల టీవీ షోలను ఆసక్తిగా చూసే ఇజ్రాయెలీ ప్లంబర్ యానివ్ హయున్ చాలా కీలకంగా వ్యవహరించారు. పైలట్‌గా ఎలాంటి శిక్షణ లేనప్పటికీ తనకు ఉన్న పరిజ్ఞానంతో తక్షణం స్పందించారు. ప్రమాద కరంగా కిందకు దూసుకెళ్తున్న విమానాన్ని కంట్రోల్ చేశారు. స్టీరింగ్ లివర్లను పైకి లాగాలని తెలియడంతో ఆ పని చేశారు. దీంతో ఆ విమానం తిరిగి నియంత్రణలోకి వచ్చింది.అదృష్టవశాత్తు విధుల్లో లేని ఇద్దరు పైలట్లు ఆ విమానంలో ప్రయాణిస్తున్నారు. వారిద్దరూ వెంటనే పైలట్ బాధ్యతలు చేపట్టారు. తోక భాగానికి భారీగా నష్టం వాటిల్లిన ఆ విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్ విమా నాశ్రయానికి మళ్లించి అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఆ ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఫ్లైదుబాయ్ విమానంలో బుధవారం రాత్రికి ఇజ్రాయెల్‌కు సురక్షితంగా చేరుకున్నారు.అయితే దాడిలో తీవ్రంగా గాయపడిన భారత కెప్టెన్ మచ్చర్ ప్రస్తుతం యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారు. ఆయనపై కత్తితో దాడి చేసి విమానం హైజాక్‌తో పాటు కూల్చేందుకు ప్రయత్నించి నట్లుగా ఆరోపణలున్న ఒమన్ కో పైలట్‌పై విచారణ జరుపు తున్నారు. ఈ విచారణ పూర్తయ్యే వరకు ఇజ్రాయెల్‌కు అన్ని విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ఆ విమానయాన సంస్థ పేర్కొంది.

# లయను సైతం పసిగడుతున్న శునకాలు

**అధ్యయనంలో వెల్లడి..**

**ముద్ర, డెస్క్**

మనుషులు మాట్లాడే నిరంతర సంభాషణలోని పదాలను కుక్కల మెదడు కూడా ఒక స్థాయిలో గుర్తించి వేరు చేస్తుందని తాజా అధ్యయనం వెల్లడించింది. బుడా పెస్ట్‌లోని ఎట్వోష్ లోరాండ్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు నిర్వహిం చిన ఈ అధ్యయనం సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. మనుషుల మాదిరిగానే కుక్కల మెదడు కూడా పదాల లయను గుర్తించి దానికి అనుగుణంగా స్పందిస్తుందని పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా పదాల్లోని హల్లులు వాటి నిర్మాణానికి ఆధారం గా ఉన్నప్పుడు కుక్కల మెదడులో ఈ సమన్వయం మరింత స్పష్టంగా కనిపించింది. మనుషుల్లో గతంలో గుర్తించిన ఈ తరహా హల్లుల ఆధారిత ప్రాధాన్యత ఇతర జంతు జాతిలోనూ కనిపించడం ఇదే తొలిసారని తెలిపారు.

**20 మంది మనుషులు, 20 కుక్కలతో అధ్యయనం..**

ఈ పరిశోధనలో 20 మంది మనుషులు, 20 పెంపుడు కుక్కలను భాగస్వామ్యం చేశారు. వీరికి నిరంతరంగా, పదాలుగా విడదీయకుండా రూపొందించిన మాటల ధ్వని ప్రవాహాలను వినిపించారు. కొన్ని ధ్వని ప్రవాహాల్లో హల్లులు, మరికొన్నింటిలో అచ్చులు మూడు అక్షరాల నమూనాలుగా పదేపదే వచ్చేలా రూపొందించారు. మరో ధ్వని ప్రవాహంలో ఎలాంటి పునరావృత నమూనాలు లేకుండా ఉంచారు. ఎలాంటి శస్త్రచికిత్స అవసరం లేని ఈఈజీ పరీక్ష ద్వారా మెదడు కార్యకలాపాలను నమోదు



చేశారు. హల్లులు పదాల నిర్మాణానికి ఆధారంగా ఉన్నప్పుడు కుక్కల మెదడు ఇతర ధ్వని ప్రవాహాలతో పోలిస్తే పదాల లయతో మరింత బలంగా సమకాలీకరించినట్లు గుర్తించారు. మనుషుల్లోనూ ఇలాగే స్పందన కనిపించింది.

**400 మిల్లీ సెకన్ల తరువాత మార్పు..**

ప్రతి పదం ప్రారంభమైన సుమారు 400 మిల్లీసెకన్ల తర్వాత కుక్కల మెదడు కార్యకలాపాల్లో మార్పు కనిపించినట్లు పరి శోధకులు గుర్తించారు. అయితే ఈ మార్పు హల్లుల ఆధారంగా పదాలు నిర్మితమైనప్పుడు మాత్రమే స్పష్టంగా కనిపించింది. నిరంతరంగా వినిపించే మాటల ప్రవాహాన్ని విడివిడిగా పదాలుగా గుర్తించే ప్రక్రియకు ఈ సమయం సంబంధం కలిగి ఉంటుందని తెలిపారు. ఆసక్తికరంగా, చిన్న వయసులో మాటలు ఎక్కువగా వినని కుక్కల్లోనూ ఇదే హల్లుల ప్రాధాన్యత కనిపించింది. జీవితంలోని తొలి మూడు నెలలు వీధిలో లేదా ఆశ్రయ కేంద్రాల్లో గడిపిన కుక్కల్లో కూడా ఇలాంటి స్పందన కనిపించడం వల్ల ఇది ప్రత్యేకమైన ప్రారంభ భాషా శిక్షణ వల్ల మాత్రమే ఏర్ప డాల్సిన అవసరం లేదని భావిస్తున్నారు. సాధారణ నమూ నాలను నేర్చుకోవడం ద్వారా కూడా ఈ నాడీ సంబంధిత ప్రాధాన్యత అభివృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు.

**మనుషులు, కుక్కల మధ్య స్పష్టంగా తేడాలు..**

మనుషులు, కుక్కల మధ్య కొన్ని ముఖ్యమైన తేడాలను కూడా అధ్యయనం వెల్లడించింది. అచ్చుల ఆధారంగా రూపొందించిన పదాలను మనుషులు గుర్తించగలిగిన ప్పటికీ, హల్లుల ఆధారంగా రూపొందించిన పదాలతో పోలిస్తే ఈ సామర్థ్యం తక్కువగా ఉంది. కుక్కలు మాత్రం అచ్చుల ఆధారంగా రూపొందించిన పదాలను గుర్తించలేక పోయాయి. రెండు జాతుల మెదళ్లూ అక్షరాల లయను ప్రాసెస్ చేసినప్పటికీ, వ్యక్తిగత మాట ధ్వనుల లయతో సమ కాలీకరణ మాత్రం మనుషుల మెదడులోనే కనిపించింది. దీంతో మనుషులు మాటలను మరింత సూక్ష్మ స్థాయిలో, వ్యక్తిగత ధ్వనులను ప్రత్యేక ప్రక్రియలుగా పరిగణిస్తూ ప్రాసెస్ చేస్తుండగా, కుక్కలు అక్షరాలను తమ కనిష్ఠ ధ్వని యూనిట్లుగా ప్రాసెస్ చేస్తున్నట్లు పరిశోధకులు సూచించారు. మాటలను ప్రాసెస్ చేసే ఈ విధానానికి మనుషుల మాదిరిగా ముందుగానే ప్రత్యేకంగా ఏర్పడిన మెదడు నిర్మాణం లేదా భాషా సామర్థ్యాలు తప్పనిసరి కావని, క్రమం తప్పకుండా మాటలు వినడం వంటి సాధారణ అనుభవాలు కూడా మెదడు పనిచేసే విధానాన్ని ప్రభావితం చేస్తాయని ఈ అధ్యయనం సూచిస్తోంది.

## మేన మామని హత్య చేసిన అల్లుడు

**24 గంటల్లో హత్య కేసు ఛేదించిన నార్సింగి పోలీసులు**

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** తనను మందలించడంతో పాటు, తనది చెడు స్నేహమని ఇంట్లో చెప్పినందుకు మేనమామనే హత్య చేశాడు అల్లుడు. నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.ఇన్స్పెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 1వ తేదీన నార్సింగి పరిధిలోని నియోపోలిస్ సమీపంలో నిర్మానుష్య ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు ఖమ్మం జిల్లాకు చెందిన, ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఈ2 హాస్టల్‌లో నివసిస్తున్న కాంపాటి వెంకన్న (50)గా గుర్తించారు.ఈ హత్యకు సంబంధించి తాళ్ల వంశీ గౌడ్ అలియాస్ సన్నీ (23), నాగన్నగారి రంజిత్ రెడ్డి (21)లను నిందితులుగా గుర్తించారు. వీరిద్దరూ స్నేహితులు మియాపూర్‌లోని సన్ ఇన్‌స్టిట్యూట్ లో చదువుకుంటున్నారు.మేనమామ మండలిం చాడని పగతో....మృతుడు వెంకన్న తన అల్లుడు వంశీ ప్రవర్తన, ఏ2 రంజిత్ రెడ్డితో అతడి స్నేహం సరికాదని చెడు స్నేహం చేస్తున్నారని వెంకన్న కుటుంబ సభ్యులకు పలుమార్లు తెలిపాడు. దీంతో వంశీ అతడిపై కక్ష పెంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా వెంకన్నకు చెందిన స్విఫ్ట్ కారును గతంలో వంశీ తీసుకెళ్లి ప్రమాదానికి గురిచేయడంతో ఇద్దరి మధ్య వివాదం ఏర్పడినట్లు వెల్లడించారు.పథకం ప్రకారమే....ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 29న వంశీ స్విఫ్ట్ కారును రిపేర్ చేయిస్తామని వెంకన్న వద్ద తీసుకున్న వంశీ కారును రంజిత్‌కు అప్పగించాడు. అనంతరం సెప్టెంబర్ 30న ఇద్దరూ కలిసి నియోపోలిస్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతాన్ని హత్యకు అనువైన ప్రదేశంగా గుర్తించి, క్రికెట్ బ్యాట్‌ను ఏర్పాటు చేసుకున్నారు.అదే రోజు రాత్రి కారు రిపేర్ చేయించామని, షెడ్ వద్ద ఉందని వెంకన్నను నమ్మించిన వంశీ అతడిని తన వెంట తీసుకెళ్లాడు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో నార్సింగి హైట్స్ సమీపంలో పార్క్ చేసిన స్విఫ్ట్ కారులో వెంకన్నను ముందు సీట్లో కూర్చోబెట్టి, వంశీ వెనుక సీట్లో కూర్చున్నాడు. రంజిత్ కారు నడుపుతూ మరమ్మతుల షెడ్‌కు తీసుకెళ్తున్నట్లు నమ్మించి నియోపోలిస్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు.అక్కడ ఇద్దరూ కలిసి క్రికెట్ బ్యాట్‌తో వెంకన్నపై దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.కేసు నమోదు చేసుకున్న నార్సింగి పోలీసులు 24 గంటల్లో కేసుని చేదించి నిందితులను అరెస్ట్ చేశారు.

## వైభవంగా అయ్యప్ప పీఠం

**ముద్ర, కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి కెపిహెచ్‌బి కాలనీ – జెఎన్‌టియు ప్రధాన రహదారిపై ఉన్న ప్రముఖ శ్రీ పోచమ్మ దేవాలయంలో ఈ సంవత్సరం కూడా అయ్యప్ప స్వాముల పీఠం వేడుకలు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.



ప్రతిఏటా సాంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ విశేష పూజా కార్యక్రమాలు అక్టోబర్ 2 నుంచి ప్రారంభమై వచ్చే ఏడాది జనవరి 10, 2027 వరకు వరుసగా 101 రోజుల పాటు నిరంతరాయంగా సాగనున్నాయి. ఈ 101 రోజుల మండల దీక్షా కాలంలో ఆలయానికి విచ్చేసే అయ్యప్ప భక్తులకు, స్వాములకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సమగ్ర ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా ప్రతీ రోజూ మధ్యాహ్నం అపరిమితమైన ఉచిత మహా అన్నదానం (భిక్ష) మరియు సాయంత్రం వేళల్లో అల్పాహారాన్ని (టిఫిన్) ఉచితంగా అందజేస్తున్నారు. భక్తుల నుండి ఒక్క రూపాయి కూడా స్వీకరించకుండా పూర్తి ఉచిత సేవగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నారు.రోజురోజుకూ అయ్యప్ప స్వాముల సంఖ్య పెరుగుతుండటంతో, ప్రతిరోజూ సుమారు వెయ్యి నుండి రెండు వేల మంది వరకు స్వాములు ఈ భిక్షా కార్యక్రమంలో పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు. జెఎన్‌టియు – కెపిహెచ్‌బి పరిసర ప్రాంతాల్లోని దీక్షాపరులు మరియు భక్తులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని, అయ్యప్ప స్వామివారి దివ్య కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపునివ్వాలి

**ముద్ర, కూకట్‌పల్లి :**తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకా రులను ప్రభుత్వం వారు జీవించి ఉన్నప్పుడే గుర్తించి, తగిన గౌరవంతో పాటు సదుపాయాలు కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు డిమాండ్ చేశారు.కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీ తొలి వెల్ఫేర్ అసోసియేషన్ స్థాపకులు, తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమ కారులు, తెలంగాణ స్నేహ వేదిక అధ్యక్షులు కక్కెర్ల మధు గౌడ్ ఆధ్వర్యంలో 'తెలంగాణ ఉద్యమకారుల కోసం మనమంతా ఒక్కటై నిలుద్దాం' అనే నినాదంతో కేపీహెచ్‌బీ రోడ్ నెంబర్ వన్‌లోని గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిరాహార దీక్ష చేపట్టారు.ఈ దీక్షా శిబిరానికి వసంత్‌నగర్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు గురు ప్రసాద్‌తో కలిసి హాజరైన వడ్డేపల్లి రాజేశ్వరరావు, ఉద్యమకారులకు పూర్తి సంఘీభావం తెలిపారు.



## యూపీఐ టారిఫ్‌లు ప్రజలపై భారం కాకూడదు

**ముద్ర, హైదరాబాద్, అక్టోబరు 2:** గాంధీ జయంతి సందర్భంగా కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ (సీఆర్ ఫౌండేషన్) ఆధ్వర్యంలో 'భారత ప్రభుత్వం ప్రతిపా దించిన యూపీఐ లావాదేవీలపై టారిఫ్‌లు' అంశంపై చర్చా గోష్ఠి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైదరాబాద్ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ డి. నరసిం హారెడ్డి మాట్లాడుతూ యూపీఐ లావాదేవీలపై టారిఫ్‌లు విధించడం వల్ల చివరకు ఆ భారం వినియోగదారులపై పడే అవకాశం ఉందన్నారు. యూపీఐ విధానం దేశంలో విస్తృతంగా వినియోగంలో ఉందని, దీనిపై నిర్ణయాలు ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉండాలని పేర్కొన్నారు.కార్యక్రమానికి సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె. నారాయణ అధ్యక్షత వహించారు. అంతకుముందు గాంధీ జయంతి సందర్భంగా సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు పల్లా వెంకటరెడ్డి, ఉపాధ్య క్షురాలు డాక్టర్ కె. రజని, కార్యదర్శి కంభంపాటి అజయ్‌కుమార్, ట్రెజరర్ చెన్నకేశ వరావు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్‌నాథ్ సింగ్‌కు అలయ్ బలయ్ ఆహ్వానం

**ముద్ర, న్యూఢిల్లీ:** అక్టోబరు 2:మాజీ గవర్నర్, అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మితో కలిసి బండారు దత్తాత్రేయ శుక్రవారం న్యూఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో అక్టోబరు 22న నిర్వహించనున్న వార్షిక 'అలయ్ బలయ్–2026' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజ రుకావాలని రాజ్‌నాథ్ సింగ్‌ను ఆహ్వానించారు.

## సర్వీస్ రోడ్డుపై అక్రమ పార్కింగ్ చేస్తే చర్యలు

**ముద్ర, శేరిలింగంపల్లి:** వివేకానందనగర్ కాలనీలో స్వామి వివేకానంద విగ్రహం నుంచి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వరకు రూ.70 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సర్వీస్ రోడ్డును పీఏసీ చైర్మన్ ఆరేకపూడి గాంధీ తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఎస్ఐ ఫిలిప్‌తో కలిసి పరిశీలించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు సర్వీస్ రోడ్డు ఉపయోగపడుతుందని గాంధీ తెలిపారు.సర్వీస్ రోడ్డుపై కార్లు, ఆటోలు, ఇతర వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అధి కారులను ఆదేశించారు. కమర్షియల్ భవనాలు, షాపింగ్ మాల్స్ నిర్వాహకులు తప్ప నిసరిగా పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఫ్యాటీ లివర్ : కూరగాయలతో పాటు జీవనశైలీ మార్పులు

మైదా, చక్కెర, కూల్‌డ్రింక్స్‌ను తగ్గించడంతో పాటు రోజూ 30–45 నిమిషాలు వేగంగా నడవడం లేదా యోగా చేయడం ముఖ్యం. కాలేయ సమస్యలు ఉన్నవారు ఆల్కహాల్‌కు దూరంగా ఉండటం మంచిది.



### జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు

## దేవంపల్లి గురుకుల విద్యార్థులు ఎంపిక




**ముద్ర కరీంనగర్:** ఛత్తీస్ గఢ్లో ఈ నెల 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, దేవంపల్లి విద్యార్థులు ఎంపికయ్యారు.జాతీయస్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ టీ. శివప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభను ప్రదర్శించి తెలంగాణ రాష్ట్రానికి, దేవంపల్లి గురుకుల పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని విద్యార్థులను ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ మనోహర్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ కోమురయ్య, పీఈటీలు జె. ప్రవీణ్, వి. శివప్రసాద్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయుల బృందం విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా కరీంనగర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బంగారస్వామి రెడ్డి మరియు ప్రధాన కార్యదర్శి దుర్గయ్య విద్యార్థులను అభినందిస్తూ, జాతీయస్థాయిలో రాణించి తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు మందీప్, శ్రీవర్ధన్లను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

## హుస్నాబాద్ - కొత్తపల్లి నాలుగు లేన్ల రహదారిని చిగురుమామిడి బైపాస్ నుంచే నిర్మించాలి

**బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి డిమాండ్**



**ముద్ర చిగురుమామిడి:** హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు నిర్మిస్తున్న నాలుగు లైన్ల రహదారి పనుల్లో భాగంగా చిగురుమామిడి గ్రామం గుండా రోడ్డును విస్తరిస్తే అనేక కుటుంబాలు తమ నివాస ఇళ్లను, వ్యాపార సముదాయాలను కోల్పోయే ప్రమాదం ఉందని, కావున ఈ రహదారిని చిగురుమామిడి బైపాస్ ద్వారానే నిర్మించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ – కొత్తపల్లి ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణం వల్ల చిగురుమామిడి గ్రామంలో ఇళ్లు, ఆస్తులు కోల్పోతున్న నిర్వాసితులు, గ్రామస్తులు చేపట్టిన దీక్షా శిబిరానికి కోమటిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి విచ్చేసి పూర్తి స్థాయి సంఘీభావం తెలిపారు. బాధితుల సమస్యలను అడిగి తెలుసుకుని, వారికి అండగా ఉంటామని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి, పేద ప్రజల ఇళ్లను కూల్చేలా రోడ్డు వెడల్పు చేయడం ఏమాత్రం తగదన్నారు. గ్రామ ప్రజల నివాసాలకు ఇబ్బంది కలగకుండా రహదారిని చిగురుమామిడి బైపాస్ మీదుగా నిర్మించాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించి అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల న్యాయమైన పోరాటానికి బీజేపీ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్, ప్రధాన కార్యదర్శి గునుకుల మధుసూదన్ రెడ్డి, మాజీ జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్, మండల కార్యదర్శి నక్క రాజేందర్, నడిగొట్టు కిరణ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు దొంత కరుణాకర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్యమకూర మోహన్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పదాల శ్రీనివాస్ గోల ప్రతినవ్ రెడ్డి చెందబోయిన రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కుల కోసం నిరసన




**ముద్ర, జగిత్యాల,** అక్టోబర్ 2: జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జగిత్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చీటి శ్రీనివాసరావు, బెజ్జంకి సంపూర్ణ చారి డిమాండ్ చేశారు. ఐజేయూ పిలుపు మేరకు గాంధీ జయంతి సందర్భంగా జగిత్యాలలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు నిరసన చేపట్టారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయ ఏఓ కిషన్‌కు అందజేశారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగుల గోపాల చారి, డిజిటల్ మీడియా కమిటీ సభ్యులు టీవీ సూర్యం, దాదుల కమిటీ సభ్యుడు ఆదిల్, జిల్లా ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, అల్లే రాము, హైదర్, రమణారెడ్డి, జిల్లా కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శులు చంద్రశేఖర్, రాజకుమార్, నరేష్, జగిత్యాల, మెట్పల్లి, కోరుట్ల, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, రాయికల్, ధర్మపురి, కొడిమ్యాల, గొల్లపెల్లి, మల్యాల, సారంగాపూర్, బీర్పూర్ మండలాల ప్రెస్ క్లబ్ బాధ్యులు ఎల్లాల రాజేందర్ రెడ్డి, శశిధర్, బూరం సంజీవ్, అజీమ్, వినోద్, మల్లేశం, గోపి, వరప్రసాద్, గంగ మల్లయ్య, రాజకుమార్, ప్రవీణ్, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు హరీష్, నరేష్, సాజిద్ పాషా, గౌస్, శంకర్ గౌడ్, మనోజ్, యూనియన్ సీనియర్ నాయకులు, ఎలక్ట్రానిక్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముంబయిలో సీజేపీపై జెన్ జడ్ నిరసనలు

**ముద్ర, ముంబై:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనలకు వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్ ముంబయి' యువత ఆందోళనకు దిగింది. గాంధీ జయంతి సందర్భంగా శివాజీ పార్క్ పరిసరాల్లో సీజేపీ వ్యవస్థాపకుడు అబిజీత్ దీప్కే నేతృత్వంలో నిరసనలు కొనసాగుతుండగా, మరోవైపు యువత శాంతియుతంగా నిరసన చేపట్టింది. రాజ్యాంగాన్ని గౌరవించడమే తమ లక్ష్యమని వారు తెలిపారు. దీంతో ముంబయిలో పరస్పర నిరసనల నేపథ్యంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# ప్రజా సాహిత్యానికి ప్రాణం పోస్తున్న మరసం

**- మరసం 40 ఏళ్ల సభలో మాజీ మంత్రి హరీష్ రావు**




**ముద్ర న్యూస్ బ్యూరో హైదరాబాద్:** కవులు అంటే కవిత్వాన్ని వెలువరించేవారు మాత్రమే కాదని మాటకు , పాటకు , ఆటకు ప్రాణం పోసే వారని క్రియాశీలకంగా నిరూపిస్తున్న మంజీరా రచయితల సంఘం (మరసం) భావితరానికి దిక్సూచి అని మాజీమంత్రి, శాసనసభ ఉపనేత తన్నీరు హరీష్ రావు అన్నారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో, గోపాల్ రెడ్డి వేదికపై శుక్రవారం జరిగిన మంజీరా రచయితల సంఘం 40 ఏళ్ల వార్షికోత్సవ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత్వం అంటే వేడుక కాదని ప్రజాపక్షంలో నిలబడడమని మరసం నిరూపించడం చారిత్రాత్మకమని చెప్పారు. 40 ఏళ్లు సాహిత్య సంస్థ నడిపించడం కత్తి మీద సాము లాంటిది చెప్పారు. నిర్బంధాలను, బెదిరింపులను, రాజ్య హింసను తట్టుకొని నిలబడిన మరసం సామాజిక సమస్యల పరిష్కారాన్ని భుజాల మీదికి ఎత్తుకున్నదని తెలిపారు .మంజీరా రచయితల సంఘం లేకుంటే తెలంగాణ ఉద్యమం ప్రజ్వరిల్లేది కాదన్నారు. కవులను, రచయితలను, కళాకారులను, జర్నలిస్టులను ఏకం చేసి ఉద్యమాన్ని మలుపుతిప్పిన ఘనత మరసం దని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన కోటి రూపాయల నగదు, ప్లాటును తిరస్కరించిన త్యాగశీలి, "నాగేటి సాలల్ల నా తెలంగాణ" పాటతో ప్రజల్లో ఎనలేని చైతన్యం కల్పించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిధారెడ్డి, మాట, ఆట,పాటలతో ఉద్యమాన్ని ఉరకలెత్తించిన దేశపతి శ్రీనివాస్ , 41 రోజుల సకల జనుల సమ్మె భేరితో పాలకులను కదిలించిన దేవి ప్రసాద్, జర్నలిస్టులను ఉద్యమం లో భాగస్వాములను చేసిన విరాహత్ అలీ కృషి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పునాదిరాళ్లని వివరించారు. మరసం సుదీర్ఘ ప్రస్థానానికి నిబద్ధతతే ప్రాణమన్నారు. భావితరానికి సరికొత్త స్ఫూర్తిని అందించాలని పిలుపునిచ్చారు. సాహిత్యం లోకి ఏఐ ప్రవేశిస్తుందని అయినప్పటికీ హృదయం పెట్టి మట్టి వాసనలతో రాసిన కవిత్వం, సాహిత్యం మాత్రమే సజీవంగా ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు . పాశ్చాత్య దేశాల్లో అన్ని వర్గాల వారు పుస్తక పఠనం వైపు మరలుతుంటే మన దేశంలో ఉయ్యాలలుగే పిల్లల సైతం సెల్ ఫోన్లలో ఊగడం ఆందోళన కలిగిస్తుందని చెప్పారు. పుస్తక పఠనాన్ని పెంపొందించాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి సాహిత్యం పై ప్రేమ లేదని ఆయన విమర్శించారు. తమ ప్రభుత్వం రాగానే తెలంగాణ అకాడమీ ఏర్పాటు చేయడం ,ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించి తెలంగాణ ఖ్యాతిని ప్రపంచం నలుమూలల చాటడం జరిగిందని వివరించారు. కాగా మూడు సంవత్సరాల నుంచి ఈ ప్రభుత్వం తెలంగాణ అకాడమీ కి తాళం వేయడం, వారి సాహిత్య నిర్లక్ష్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజీరా నదిలోని చుక్క నీటిని వాడుకునే అవకాశం, ఒక్క చెక్ డాం ను నిర్మించే ప్రయత్నం జరగలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం రాగానే మంజీరా నదిపై చెక్ డ్యామ్ లను నిర్మించిందని , ఉమ్మడి మెదక్ జిల్లాలోని బీడు పడ్డ భూములను పచ్చగా మార్చిందని వివరించారు.

***మరసం వ్యక్తి కేంద్రం కాదు: దేశపతి**

మంజీరా రచయితల సంఘం వ్యక్తి కేంద్రంగా పనిచేయలేదని వస్తువు , విషయము కేంద్రంగా పనిచేస్తుందని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ చెప్పారు. ఒక లక్ష్యంతో, ఆశయంతో నడుస్తుందని చెప్పారు. ఉద్యమాలకు ఆటగా , మాటగా, గొంతు గా మారిందని తెలిపారు.విభిన్న వ్యక్తులను, భావజాలాలను , సంస్థలను ఒక వేదికపై తీసుకువచ్చి నడిపించిన ఘనత మరసందని తెలిపారు. తన సాహిత్య, సాంస్కృతిక వికాసానికి మరసం పునాది పరిచిందని తెలిపారు .బెల్లి లలిత లాంటి అద్భుత కళాకారులను మరసం వెలుగులోకి తీసుకొచ్చిందని తెలిపారు.

***మరసం పీడితుల పక్షం: నందిని సిధారెడ్డి**

మంజీరా నది స్ఫూర్తితో ప్రారంభమైన మంజీరా రచయితల సంఘం ఎప్పుడు ప్రజల పక్షమే వహిస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, మరసం వ్యవస్థాపకులు, కవి రచయిత డాక్టర్ నందిని సిద్ధారెడ్డి స్పష్టం చేశారు. నిర్బంధాలను, అవరోధాలను ఎదుర్కొంటూ అన్ని వర్గాల వారికి వేదికగా నిలుస్తుందని తెలిపారు. సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ఉద్యమాలకు మరసం ప్రేరణగా నిలిచిందన్నారు. అన్ని వర్గాల ప్రజలతో, పల్లెలతో మరసం మ మైకమైందని చెప్పారు. మరసం కవులకు, రచయితలకు, కళాకారులకు, జర్నలిస్టులకు స్ఫూర్తి నింపిందని తెలిపారు.

**మాది తల్లి బిడ్డల అనుబంధం: విరాహత్**

మెతుకుసీమలో మంజీరా రచయితల సంఘంతో జర్నలిస్టులకు తల్లి బిడ్డలకు ఉండే బంధం ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ తెలిపారు. మరసం కవుల రచనలు వార్తలుగా , జర్నలిస్టుల వార్తలు కవితలుగా మారినట్టు పేర్కొన్నారు. ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని, ప్రజల గొంతుకగా నిలబడి, మరసంతో కలిసి జర్నలిస్టుల సంఘం పోరు చేసినట్లు ఆయన తెలిపారు. మరసం అందించిన స్ఫూర్తితోనే 25 ఏళ్ళ క్రితం జర్నలిస్టుల బతుకులపై తాము "కలం రాగాలు" ఆడియో క్యాసెట్ ను నిర్మించినట్లు విరాహత్ చెప్పారు. జిల్లాలో జర్నలిస్టులు నిర్బంధాలను ఎదుర్కోవడంలో మరసం అండగా నిలిచినట్లు చెప్పారు.

**స్తబ్దతను బద్దలు కొట్టాలి: దేవి ప్రసాద్**

సమాజంలో పెరుగుతున్న స్తబ్దతను కవులు, రచయితలు బద్దలు కొట్టాలని టిఎన్జీవోల సంఘం పూర్వధ్యక్షులు దేవి ప్రసాద్ పిలుపునిచ్చారు. మేధావుల మౌనం ప్రమాదకరమన్నారు. సంక్షోభాలను అధిగమించడానికి పోరాటాలు కావాలన్నారు. మరసం ప్రజా పోరాటాలకు మద్దతుగా నిలబడిందని తెలిపారు. మహాసభకు మరసం అధ్యక్షులు రంగాచారి అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి సిద్ధంకి యాదగిరి నివేదిక సమర్పించారు. సమావేశంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరం శంకరం, సీనియర్ పాత్రికేయులు కే అంజయ్య, తోట అశోక్, కవులు పపప్పుల రాజిరెడ్డి, అలాజిపూర్ కిషన్, భగవాన్ రెడ్డి తదితరులు ప్రసంగించారు. అంతకుముందు ప్రెస్ క్లబ్ ముందు మరసం జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రార్థన గీతాన్ని ఆలపించారు. మహా కవులను, రచయితలను స్మరించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మహాసభకు తెలంగాణ నలుమూలల నుంచి కవులు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు హాజరయ్యారవ్వడంతో బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ కిక్కిరిసిపోయింది.

**చైతన్యాన్ని అందించిన వక్తల ప్రసంగాలు**

మరసం 40ఏళ్ళ వార్షికోత్సవ సందర్భంలో అంశాలపై నిర్వహించిన సాహిత్య సభలు సభికులను ఆలోచింపజేసాయి. సాహిత్యం – మహిళా దృక్పథం అంశంపై సాహిత్య విమర్శకురాలు నెల్లుట్ల రమాదేవి, సాహిత్యం – దళిత దృక్పథం అంశంపై కోయి కోటేశ్వరరావు, సాహిత్యం – ద్రావిడ దృక్పథం అంశంపై జిలుకర శ్రీనివాస్ లు మాట్లాడారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో 30మంది కవులు పాల్గొన్నారు.

## ఐ.జే.యు. కోర్కెలదినం సక్సెస్

**సమస్యల పరిష్కారం కోరుతూ**
**దేశవ్యాప్తంగా రోడ్లెక్కిన జర్నలిస్టులు!**

**ముద్ర, విజయవాడ :** గాంధీ జయంతి రోజున దేశవ్యాప్తంగా కోర్కెలదినం పాటించాలన్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ పిలుపు నకు అపూర్వ స్పందన లభించింది. శుక్రవారం రాత్రి వరకూ ఐ.జే.యు. కేంద్రానికి అందిన సమాచారం మేరకు పద్దెనిమిది రాష్ట్రాల్లోని దాదాపు 350 కేంద్రాల్లో "కోర్కెలదినం" కార్యక్రమం జరిగింది. తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ వేలాదిమంది జర్నలిస్టులు వీధుల్లోకి వచ్చారు. ర్యాలీలు, ధర్నాలు , సభలు సమావేశాలు నిర్వహించారు. మంత్రులకు, ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందచేశారు. కార్యక్రమం జరిగిన అన్ని కేంద్రాల్లో గాంధీ జయంతి సందర్భంగా జర్నలిస్టులు తొలుత మహాత్మా గాంధీజీ విగ్రహాలవద్దకు చేరుకున్నారు. జాతిపితకు నివాళులు అర్పించారు. తమ కోర్కెలకు మద్దతుగా అక్కడే పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

మీడియా స్థితిగతులను అధ్యయనం చేయడానికి వీలుగా మీడియా కమిషన్ ను ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల భద్రతకు జాతీయ స్థాయిలో ఒక ప్రత్యేక చట్టం చేయాలని, 1955,1958 నాటి వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాలను వెంటనే పునరుద్ధరించాలని, 2007 తర్వాత జర్నలిస్టులకు వేతన సవరణ జరగ నందున వెంటనే కొత్త వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఐ.జే.యు. లేవనెత్తిన సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయా రాష్ట్రాల అనుబంధ సంఘాలు భారత రాష్ట్రపతికి పంపించాయి. వివిధ రాష్ట్రాల్లో జర్నలిస్టులు తాము ఎదుర్కుంటున్న స్థానిక సమస్యలను కూడా వినతి పత్రాలలో ప్రస్తావిస్తూ ప్రజా ప్రతినిధులకు, అధికారులకు అందచేశారు. సమస్యలు పరిష్కారం జరగని పక్షంలో తను ఉద్యమిస్తామని వారు స్పష్టం చేశారు.

"కోర్కెల దినం" కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాలు పంచుకున్న వేలాది మంది జర్నలిస్టులను ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్మూ , సెక్రెటరీ జనరల్ డి. సోమసుందర్ శుక్రవారం రాత్రి విడుదల చేసిన ఒక మీడియా ప్రకటనలో అభినందించారు. ప్రణాళికా బద్ధంగా కార్యక్రమాన్ని జయప్రదం చేసిన ఐ.జే.యూ. అనుబంధ రాష్ట్ర సంఘాలకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఐ.జే.యు. లేవనెత్తిన సమస్యలకు జర్నలిస్టుల నుంచి లభించిన స్పందనను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

## జర్నలిస్టుల హక్కుల కోసం గాంధీ విగ్రహం వద్ద నిరసన




**- ఆరు డిమాండ్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలి**
**- టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగాండ్ల శ్రీనివాస్, కొయ్యడ చంద్ర శేఖర్**
**- జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్ర 'ను కలిసి వినతిపత్రం అందజేత**

**ముద్ర, కరీంనగర్** : జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అధ్యక్ష కార్యదర్శులు గాండ్ల శ్రీనివాస్, కొయ్యడ చంద్ర శేఖర్ లు డిమాండ్ చేశారు.ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) పిలుపు మేరకు గాంధీ జయంతి సందర్భంగా కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో పాలనాధికారి చిత్ర మిశ్ర కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా గాండ్ల శ్రీనివాస్ కొయ్యడ చంద్రశేఖర్ లు మాట్లాడుతూ.. బెంగళూరులో జరిగిన ఐజేయూ కార్యవర్గ సమావేశంలో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని సమావేశం ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. మీడియా రంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి నూతన మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మీడియా సిబ్బందికి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, రద్దు చేసిన చట్టాల స్థానంలో జర్నలిస్టుల చట్టబద్ధమైన హక్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం నూతన వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న తరహాలో హెల్త్ కార్డులు మంజూరు చేసి క్యాష్‌లెస్ వైద్య చికిత్స అందించాలని టీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్, రాష్ట్ర మాజీ ఉప అధ్యక్షులు అయిలు రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు గాండ్ల సంపత్, ఎండి షకూర్, సంయుక్త కార్యదర్శి దాడి సంపత్ కోశాధికారి గాజుల వెంకటేష్, ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి యూ.రవీందర్, సీనియర్ నాయకులు కే విజయందర్ రెడ్డి అనుబంధ కమిటీ ల రాష్ట్ర నాయకులు ఈద మధుకర్, ఎన్ మహీంద్రా చారి, జిల్లా కార్య వర్గ సభ్యులు జన్నారం శ్రీనివాస్, కే గంగరాజు, ఎలిగేటి శ్రీనివాస్, కే వేణు గోపాల్, బుర్ర తిరుపతి, కంకణాల రఘు, రేగుల నర్సింగం, సిరిసిల్ల అనిల్ కుమార్, బుర్ర పరుశురాం గౌడ్, బీ సదానందం ,అజ్గర్ హుస్సేన్,ఎంఎ అసద్, వి సదానందం,శంకరపట్నం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జక్కోజు రమేష్, జిల్లా అనుబంధ కమిటీల నాయకులు జక్కుల సుమ బీ సతీష్, లతో పాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 03.10.2026
www.mudranews.in | @mudranews



### సొరకాయకు ప్రాధాన్యం ఇవ్వండి

నీటి శాతం ఎక్కువగా, కేలరీలు తక్కువగా ఉండే సొరకాయను డైట్‌లో చేర్చుకోవచ్చు. ఇందులో ఫైబర్, విటమిన్ C, పొటాషియం లభిస్తాయి.



# మహాత్మా గాంధీకి నివాళి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకొని గాంధీజీ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి లతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహ మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో ఆదర్శప్రాయమని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి అంజి రెడ్డి,జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.












**తాజాపూర్‌లో ప్రత్యేక గ్రామ సభ**

గాంధీ జయంతి సందర్భంగా భువనగిరి మండలం తాజాపూర్ గ్రామంలో ప్రత్యేక గ్రామసభ సర్పంచ్ ర్యాకాల సంతోష్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ గ్రామ సభకు వీబీ – జి రామ్–జి , గ్రామీణాభివృద్ధి శాఖ, భారత ప్రభుత్వం డైరెక్టర్ శివ శంకర్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి హాజరయ్యారు. తొలుత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఇప్పటికే చేపట్టిన ఇంకుడు గుంతలు, వర్టికల్ సోక్ పిట్లు, పాఠశాలలో ఏర్పాటు చేసిన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్‌లను అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా వీబీ – జి రామ్–జి డైరెక్టర్ పి. శివ శంకర్ మాట్లాడుతూ, వీబీ – జి రామ్–జి కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని కూలీలకు జూన్ 2027 వరకు నిరంతరంగా ఉపాధి కల్పించేలా ముందస్తుగా అవసరమైన పనులను గుర్తించి సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. గ్రామంలోని సహజ వనరులు, భౌగోళిక పరిస్థితులు, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్‌లను రూపొందించి, అవసరమైన పనులను శాస్త్రీయంగా గుర్తించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వర్షాధార పంటలపై పూర్తిగా ఆధారపడకుండా పంట మార్పిడి విధానాలను అవలంబించాలని సూచించారు. జల సిరి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన అధికారులు కిరణ్ చరణ్ పాడే, పి. శ్రీలక్ష్మి, ఎం. శ్రీనివాస్, ఎం. శేషు కుమార్, సురేష్ బాబు, జి. సురేష్, ఎం. శ్రీనివాస్ రెడ్డి, సి.హెచ్. శ్రీనివాస్, వైష్ణవి, అబేద్ ఖాన్, ఎంపీడీఓ జి. విజయలక్ష్మి, మండల పంచాయతీ అధికారి దినకర్, రాజశేఖర్, బాలస్వామి, ఉప సర్పంచ్ వారిగంటి కృష్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

**ఖమ్మం జిల్లాలో..**

**ముద్ర, ఖమ్మం, అక్టోబరు 2:**జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం, కేంద్ర గ్రంథాలయం, పోలీస్ కమిషనర్ కార్యాలయంతో పాటు పలు ప్రాంతాల్లో గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యం, అహింస, శాంతి, సామాజిక న్యాయం వంటి గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, పోలీసు సిబ్బంది, గ్రంథాలయ అధికారులు, పాఠకులు పాల్గొన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని గాంధీజీ విగ్రహానికి, కలెక్టరేట్ సమావేశ మందిరంలో గాంధీజీ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అహింస, సత్యం అనే మార్గాల్లో స్వాతంత్ర్య సమరాన్ని నడిపి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. ఆయన కలలు కన్న గ్రామ స్వరాజ్యం, స్వచ్ఛత సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ అధికారులు ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి రామూర్తి, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఫిరంగి, ఉప కోశాధికారి వేలాద్రి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ విగ్రహం ఆవిష్కరణ

**మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి**
**ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి** :మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని తుక్కాపురం గ్రామంలో మహిళా శక్తి భవనం, మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, గ్రామ స్వరాజ్యం మార్గాలు నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జనగాం పాండు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తి, పిఎసిఎస్ చైర్మన్ పక్కిర్ కొండల్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ఎలిమినేటి కృష్ణారెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణిరవికుమార్, నాయకులు, ఉపసర్పంచ్, గ్రామ పాలకవర్గ సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్తాం




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయు) పిలుపుమేరకు గాంధీ జయంతి రోజున భువనగిరిలో టి యు డబ్ల్యూ జే (ఐజేయు) ఆధ్వర్యంలో వినతి పత్రాలు సమర్పించిన సందర్భంగా వారు మాట్లాడారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు కేటాయించేందుకు, అన్ని ఆసుపత్రులలో జర్నలిస్టుల హెల్త్ బీమా వర్తించేలా ప్రభుత్వం దృష్టికి ఇసుక వెళ్తామని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా వ్యవహరిస్తున్న జర్నలిస్టుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ముందుగా యూనియన్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్లు భాస్కర్ రావు, వెంకా రెడ్డి, మునిసిపల్ చైర్ పర్సన్ తంగేళ్లపల్లి శ్రీవాణి, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎండి అవేజ్ చిస్తి,యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యంబ నరసింహులు, పోతంశెట్టి కరుణాకర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి కె నరసింహ చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెలిమినేటి జహంగీర్, కే మల్లేష్ చారి, పట్టణ అధ్యక్షుడు పి లక్ష్మీనారాయణ చారి,ఎం చేన్నయ్య, పీ మల్లేశం,పాశం నవీన్, జి హరిబాబు, ఎం అనిల్ కుమార్, ఆరే కుమార్, నల్ల వేణు, ఉదయ్ రెడ్డి, కిషన్, మహేష్ , బుగ్గ శ్రీనివాస్, భారత్ జాకీర్, బండారు జగదీష్, సత్యం, ముద్ర శివ, నిమ్మల సురేష్ గౌడ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**ముద్ర, ఖమ్మం, అక్టోబరు 2:**జర్నలిస్టుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు డిమాండ్ చేశారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ ఖమ్మంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళనలు చేపడతామని జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రెస్‌క్లబ్, కెమెరామెన్, ఫొటోగ్రాఫర్ల సంఘాల ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.




## సిఇసి జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలి

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 2 :** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పెన్షనర్స్ సంఘం జిల్లా కార్యదర్శి రవికుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బిజెపి ఒత్తిళ్లకు తలొగ్గి దేశంలో సుమారు 13 కోట్ల మంది అర్హులైన ఓట్లను ఏకపక్షంగా తొలగించారని, ఇది ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని మండిపడ్డారు. తక్షణమే 'సర్ ప్రక్రియను నిలిపివేసి, తొలగించిన ఓట్లను తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర వ్యవస్థ అయిన ఎన్నికల కమిషన్‌ను అపహాస్యం చేసిన సిఇసి జ్ఞానేశ్ కుమార్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు జి. రామయ్య, ఆవుల అశోక్, టీపీటీఎఫ్ నాయకులు వి. మనోహర్ రాజ్, నాయకులు సిహెచ్. శిరోమణి, టీ. ఝాన్సీ, కే. శ్రీనివాస్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, మురళీకృష్ణ, సూర్య పాల్గొన్నారు.



## ఈసీ వైఖరిపై 'ఇండియా' కూటమి సమరశంఖం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 2 :** బీజేపీ ఒత్తిళ్లకు తలొగ్గి ఎలక్షన్ కమిషన్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని, ఓట్ల చోరీకి పాల్పడుతోందని అఖిలపక్ష నాయకులు విమర్శించారు. సంజీవరెడ్డి భవనంలో అఖిలపక్ష నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈసీ తీరును ఎండగట్టేందుకు ఈ నెల 8 వరకు జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా 3, 4 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసనలు, 5, 6, 7 తేదీల్లో విస్తృత ప్రచారం చేపడతామని, 8న ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు 10 వేల మందితో భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. సీఈసీ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ నిరసనల్లో ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, సిపిఐ నాయకులు బాగం హేమంతరావు, సిపిఎం నాయకులు నున్న నాగేశ్వరరావు, న్యూడెమోక్రసీ నాయకులు అవునూరి మధు, మాస్ లైన్ నాయకులు అశోక్ ప్రజాసంఘాలు, భాగస్వామ్య పక్షాల నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 2 :** వెలుగుమట్ల ప్రాంతంలో అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలకు ఉపక్రమించింది. అక్రమ మైనింగ్‌ను ఎంతమాత్రం సహించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు ఉమ్మడిగా వెలుగుమట్ల పార్కు సమీపంలోని ప్రైవేట్ వెంచర్ పట్టా భూముల్లో తనిఖీలు చేపట్టారు. అక్కడ కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా బరైటీస్ ఖనిజాన్ని తవ్వుతున్నట్లు అధికారులు గుర్తించారు. చిన్న చిన్న గుంతలు తీసి లభించిన బోల్డర్లను పగలగొట్టి, ట్రాక్టర్ల ద్వారా పక్కనే ఉన్న మినరల్ డీలర్లకు అమ్ముతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. మైనింగ్ అధికారులు, అర్బన్ తహశీల్దార్ సంయుక్తంగా అక్రమ రవాణా జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి తవ్వకాల కొలతలను నమోదు చేశారు. ఈ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న పట్టాదారులను, ఇతర బాధ్యులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేశామని, వారిపై నోటీసులు జారీ చేసి భారీగా పెనాల్టీలు విధించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతేకాకుండా, నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఖనిజాన్ని కొనుగోలు చేసే మినరల్ డీలర్ల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# శాస్త్రి ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

**దేశ సేవ, నిజాయితీ, నిరాడంబరతకు శాస్త్రి ప్రతీక**
**31వ వార్డు బంజారాహిల్స్‌లో ఘనంగా జయంతి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**భారతదేశ మాజీ ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, దేశభక్తుడు, నిరాడంబరతకు ప్రతీక లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను భువనగిరి పట్టణంలోని 31వ వార్డు బంజారాహిల్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో 31వ వార్డు కౌన్సిలర్ సుమయ్యా తబస్సుమ్ షఫీక్ అహ్మద్ పాల్గొని లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను, ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయనకున్న నిబద్ధతను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, లాల్ బహదూర్ శాస్త్రి గారు దేశ సేవకు, నిజాయితీకి, క్రమశిక్షణకు, నిరాడంబరతకు నిలువెత్తు ప్రతీక అని అన్నారు. అత్యున్నత పదవిలో ఉన్నప్పటికీ సాధారణ జీవన విధానాన్ని కొనసాగిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. దేశ సమగ్రత, అభివృద్ధి, ప్రజాసేవ పట్ల ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.దేశంలో కష్టకాలంలో ప్రజలను, సైనికులను, రైతులను ప్రోత్సహిస్తూ శాస్త్రి గారు ఇచ్చిన "జై జవాన్.. జై కిసాన్" నినాదం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని కౌన్సిలర్ పేర్కొన్నారు. దేశ సరిహద్దులను కాపాడే జవాన్లతో పాటు దేశానికి అన్నం పెట్టే రైతుల సేవలను సమానంగా గౌరవించిన గొప్ప నాయకుడు లాల్ బహదూర్ శాస్త్రి అని కొనియాడారు.ప్రస్తుత తరంలోని యువత శాస్త్రి గారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నిజాయితీ, క్రమశిక్షణ, దేశభక్తి, ప్రజాసేవ వంటి విలువలను జీవితంలో ఆచరించాలని ఆమె పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు పెద్దలు బానోతు సోమయ్య, బానోతు సంతోష్, మన్సూర్, వల్లమాసు రాము, జగదీశ్, సాంబయ్య, సతీష్ నాయక్ , బానోతు అనూషా, బానోతు జ్యోతి, ధనమ్మ, లలిత, పావని, రమా, రంజిత్, సంజీవ్, పాల్గొన్నారు.

# గాంధీజీ పట్ల అదే నిర్లక్ష్యం



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం పట్ల అధికారుల నిర్లక్ష్యం మరోసారి వెలుగు చూసింది. గాంధీ జయంతి సందర్భంగా లంగర్‌హౌస్‌లోని గాంధీ విగ్రహాన్ని కనీసం శుభ్రం చేయకుండానే పూలమాలలు వేసి కార్యక్రమం నిర్వహించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దుమ్ము, ధూళితో అపరిశుభ్రంగా ఉన్న విగ్రహాన్ని చూసి పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.గాంధీ జయంతి సందర్భంగా అక్కడికి చేరుకున్న లంగర్‌హౌస్ ఆర్యవైశ్య నాయకులు నీరు, షాంపూతో విగ్రహాన్ని శుభ్రంగా కడిగి అనంతరం గాంధీజీకి నివాళులర్పించారు. గతంలోనూ బాపుఘాట్ పరిసరాల్లో అపరిశుభ్రతపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో అధికారులు గాంధీజీ విగ్రహాలు, స్మారక ప్రాంతాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

## గాంధీ జయంతి రోజు పాఠశాల నిర్వహణపై విమర్శలు




**ముద్ర, వలిగొండ:** గాంధీ జయంతి సందర్భంగా వలిగొండ పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలను నిర్వహించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రోజున విద్యాసంస్థలకు సెలవు పాటించాల్సి ఉండగా పాఠశాల నిర్వహించడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు.విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, గాంధీజీ ఆశయాలను తెలియజేయాల్సిన విద్యాసంస్థలోనే జయంతి రోజున పాఠశాల నిర్వహించడం విచారకరమన్నారు. మీడియా ప్రతినిధులు పాఠశాలకు వెళ్లిన సమయంలో విద్యార్థులను బయటకు పంపించారని తెలిపారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

## విలేకరికి ఎమ్మెల్యే పరామర్శ

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** పట్టణంలోని కిసాన్‌నగర్‌లో ప్రముఖ ఈనాడు పత్రిక పాత్రికేయుడు జి.వి. శ్రీనివాస్‌ను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చిస్తీ, ఆదినారాయణ, కూర వెంకటేష్, బర్రె జహంగీర్, గ్యాస్ చిన్న పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 03.10.2026
www.mudranews.in | @mudranews



## పాలకూరను డైట్‌లో చేర్చండి

ఫైబర్, ఐరన్, విటమిన్లు, మెగ్నీషియం, పొటాషియం అధికంగా ఉండే పాలకూరను తరచుగా తీసుకోవడం మెటబాలిక్ ఆరోగ్యానికి తోడ్పడుతుంది.



# గాంధీ మహాత్మునికి నివాళి







**ముద్ర ప్రతినిధి, మెదక్:**మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ క్యాంప్ ఆఫీస్ లో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం అహింస, సత్యాగ్రహ మార్గాలను అనుసరించి ప్రజలను ఏకతాటిపైకి తీసుకు వచ్చారన్నారు. సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం వంటి మహాత్మా గాంధీ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సమాజ అభివృద్దికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.కలెక్టరేట్ లో ఎఓ యునస్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్పీ శ్రీనివాస్ రావు నివాళులుమహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సీఐలు జార్జ్, రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**మున్సిపల్ చైర్ పర్సన్ ఆధ్వర్యంలో**

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయం, రాందాస్ చౌరస్తా, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలలో గాంధీ విగ్రహం చిత్రపటాలకు మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతిరాజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అందరికీ గాంధీ మార్గం అనుసరణీయమన్నారు. వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందుగుల గంగాధర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, మున్సిపల్ కౌన్సిలర్లు అవారి రాజశేఖర్, తొడుపునూరి శివరామకృష్ణ, గౌస్ ఖురేషి, కో ఆప్షన్ సభ్యులు రాగి వనజ, అనూష, పార్టీ నాయకులు గూడూరి ఆంజనేయులు గౌడ్, కొట్టాల విశ్వం, కొండ శీను, ప్రవీణ్ గౌడ్, దేవుల నాయక్, పురం వెంకటనారాయణ, మహేశ్వరి, నాగరాజు, గాడి రమేష్, మహమ్మద్ గౌస్, ఫసి తదితరులు పాల్గొన్నారు. టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో మెదక్ లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా అధ్యక్షులు కే యాదగిరి, టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వి.సంగయ్య, డి. హీరాలాల్, నజీరుద్దీన్, యాదగిరి, నసిరుద్దీన్, కే.శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు, పి.యాదగిరి, రాజశేఖర్ సురేందర్, కిషన్, వీర్ కుమార్ చారి, శ్రీకాంత్, అశోక్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.పిఆర్టీయూ టిఎస్ జిల్లా శాఖ అధ్యక్షులు తాళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. బాధ్యులు సుంకరి కృష్ణ, మహేష్, శిరిగే చంద్రశేఖర్, రఘు బాబు, అమీర్ ఉద్దీన్, శ్రీనివాస్, నవీన్, రాజు, సురేష్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. మెదక్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎఎంసి మాజీ చైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, కౌన్సిలర్ లు బట్టి ఉదయ్ కుమార్, జుబెర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్లు భీమరి కిషోర్, ఆర్కే శ్రీనివాస్, రబ్బిన్ దివాకర్, మాయ మల్లేశం, నాయకులు లింగారెడ్డి, గడ్డమీద కృష్ణగౌడ్, ప్రభురెడ్డి, మోచి కిషన్, పెరిక. కిషన్, ఇందాద్, ఇస్మాయిల్, అరుణ్‌కుమార్, వెంకటేశం, సాయి, యాదగిరి, రవి, రంజిత్ నాయక్, తరుణ్, రవి పాల్గొన్నారు.

# పాత్రికేయుల డిమాండ్లు పరిష్కరించాలి

**టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎ.శంకర్ దయాళ్ చారి డిమాండ్**
**గాంధీ విగ్రహం వద్ద 'డిమాండ్స్ డే'**
**కలెక్టర్ ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** దేశవ్యాప్తంగా పనిచేస్తున్న పాత్రికేయుల డిమాండ్లు పరిష్కరించాలని ఐజేయూ పిలుపుమేరకు టియూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రం మెదక్ రాందాస్ చౌరస్తాలో గాంధీ విగ్రహం వద్ద డిమాండ్స్ డే నిరసన తెలిపారు. రాష్ట్రపతికి వినతిపత్రం కలెక్టర్ ఎఓ యూనుస్ ద్వారా అందజేశారు. టియూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎ. శంకర్ దయాళ్ చారి మాట్లాడుతూ... జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా 'పనిచేస్తున్న పాత్రికేయుల డిమాండ్ల దినం'గా పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. సమగ్ర మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ రంగాన్ని సమగ్రంగా సమీక్షించి, ఆధునిక యుగానికి అనువైన విధాన సిఫార్సులను రూపొందించడానికి ఒక కొత్త మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయడం అత్యవసరమన్నారు. పాత్రికేయులు, మీడియా సంస్థల భద్రత కోసం ఒక ప్రత్యేక కేంద్ర చట్టాన్ని రూపొందించాలన్నారు. పత్రికా రంగం భారత ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభంగా పనిచేస్తుంది. స్వతంత్ర, సురక్షితమైన మీడియా వాతావరణం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి పునాది. శారీరక దాడులు, ఏకపక్ష నిర్బంధాలు, ఆన్‌లైన్ వేధింపులు, సంస్థాగత బెదిరింపులను ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. మీడియా సిబ్బంది తమ విధులను నిర్భయంగా నిర్వర్తించేలా చూడటానికి, కేంద్ర ప్రభుత్వం పాత్రికేయులను, మీడియా సిబ్బందిని, వార్తా సంస్థలను హింస, అనుచిత అణచివేత నుండి కాపాడే ఒక పటిష్టమైన, స్వతంత్ర జాతీయ చట్టాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 1955, 1958 చట్టాల కింద మొదటగా హామీ ఇవ్వబడిన ప్రత్యేక రక్షణలను తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. మీడియా ఉద్యోగుల కోసం రెండు దశాబ్దాల క్రితం, 2007లో ఏర్పాటు చేయబడింది. జీవన వ్యయాలు, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగినప్పటికీ, ప్రభుత్వ, కార్పొరేట్ రంగాలలో జీతాలు ఎప్పటికప్పుడు సవరించబడుతున్నప్పటికీ, మీడియా కార్మికులకు చట్టబద్ధమైన వేతన నవీకరణలు అందలేదు. ముద్రణ, ప్రసార, డిజిటల్ మీడియా సిబ్బందిని కలుపుకొని, న్యాయమైన, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా సర్దుబాటు చేయబడిన పరిహార నిర్మాణాలను సిఫార్సు చేయడానికి ఒక కొత్త వేతన మండలిని ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు ఇళ్ళు, ఇళ్లస్థలాల సమస్య పరిష్కరించడంతోపాటు ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇచ్చి క్యాష్ లెస్ ట్రీట్మెంట్ అందించాలని, జర్నలిస్టులపై నిత్యం జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తగిన చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. సంతోష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డీ.జి. శ్రీనివాస్ శర్మ, ఐజేయూ సభ్యులు శ్రీనివాస్ మిన్పూర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు బొందుగుల నాగరాజు, ప్రెస్ క్లబ్ కోశాధికారి అశోక్, గౌరవ సలహాదారులు ఫారూక్ హుస్సేన్, శ్రీధర్, హరినాథ్, గౌరవ అధ్యక్షులు కామాటి కృష్ణ,సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ బాధ్యులు రమేష్ గౌడ్, నగేష్, శివ చరణ్, రాము పటేరి, ప్రకాష్, రామ కృష్ణ గౌడ్, కృష్ణ గౌడ్, రాజశేఖర్, లక్ష్మి నారాయణ, మురళీధర్,బోనగిరి చంద్రశేఖర్, గోవర్ధన్ రెడ్డి, చింతల రమేష్, ఖయ్యూం, అల్లాడి శేఖర్, యూసుఫ్ అలీ, సఫ్దర్, హమీద్, రాము, నరేందర్, నర్సింహులు, సత్యనారాయణ, బైరవరెడ్డి, రాంచందర్ రెడ్డి, గిరి, శ్రీహరి గౌడ్, కార్తీక్, సాయి, ఆంజనేయులు గౌడ్, సుభాష్, రాఘవులు, జనార్దన్, రఘు, స్వాగత్ రాజు, శ్రీను, రాజశేఖర్, సంతోష్ గౌడ్ పాల్గొన్నారు.



**కొండమల్లేపల్లిలో..**

**ముద్ర, దేవరకొండ:**జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే–ఐజేయూ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించి, సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకుని పంచాయతీ కార్యదర్శి డాకు నాయక్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మద్ద శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే–ఐజేయూ నాయకులు ఎండీ మోహినుద్దీన్, బూడిద శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## బి. నర్సింగ్‌రావు తెలంగాణ పునరుజ్జీవన ప్రతిభామూర్తి





**ముద్ర, హైదరాబాద్:**తెలంగాణకు చెందిన ప్రముఖ సినీ దర్శకుడు, రచయిత, చిత్రకారుడు, ఛాయాగ్రాహకుడు, రంగస్థల కళాకారుడు, సంగీతకారుడు, సాంస్కృతిక దస్తావేజీకర్త బి. నర్సింగ్‌రావుకు డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ (Honoris Causa) ప్రదానం చేయనుంది.'మా భూమి', 'మా ఊరు', 'దాసి', 'మట్టి మనుషులు' వంటి చిత్రాల ద్వారా తెలంగాణ భూదృశ్యాలు, మాండలికాలు, జానపద సంప్రదాయాలు, సామాజిక వాస్తవాలను జాతీయ, అంతర్జాతీయ వేదికలకు పరిచయం చేసిన నర్సింగ్‌రావు విశిష్ట సాంస్కృతిక సేవలను విశ్వవిద్యాలయం గుర్తించింది. వివిధ కళా రూపాలను సమన్వయం చేస్తూ తెలంగాణ కళా, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనుంది. ఆయనను 'తెలంగాణ పునరుజ్జీవన ప్రతిభామూర్తి'గా పలువురు అభివర్ణిస్తున్నారు.

## ఉద్యమకారుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

**ముద్ర, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గం, కేపీహెచ్‌బీ రోడ్ నంబర్–1లో తమకు కేటాయించాల్సిన స్థలాలు, ఇళ్ల కోసం ఉద్యమకారులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ హాజరై తన పూర్తి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన ఉద్యమకారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను మరియు డిమాండ్లను వివరంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పూర్తిగా న్యాయమైనవని, వీటిని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సంబంధిత ప్రభుత్వ అధికారులతో చర్చించి, ఇళ్లు మరియు స్థలాల



కేటాయింపు ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ తరఫున అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

## ఘనంగా గాంధీ జయంతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా భువనగిరి పట్టణంలోని గాంధీ పార్క్ వద్ద నిర్వహించిన వేడుకల్లో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ పోషించిన కీలక పాత్రను, దేశానికి ఆయన అందించిన సేవలను ఎమ్మెల్యే స్మరించుకున్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకారెడ్డి,మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి–రవికుమార్, గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ, ఆర్డీఓ కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల–వెంకటేశ్వర్లు, ఆత్మ చైర్మన్ ఎలిమినేటి కృష్ణారెడ్డి, భువనగిరి సింగిల్‌విండో చైర్మన్ కొండల్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పట్టణ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఇతర ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో... బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆంజనేయులు, పెంట నరసింహ, నాయకులు గోపాల్, యూత్ నాయకులు పాల్గొన్నారు. సబ్ జైల్లో...గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం భువనగిరి సబ్‌జైలులో నిర్వహించిన జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా భువనగిరి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఉషశ్రీ పాల్గొన్నారు.మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలిసీ తెలియక చేసిన తప్పులతో జైలు జీవితం గడుపుతున్న ఖైదీలు ఇకపై సత్ప్రవర్తనతో మెలిగి, తిరిగి నేరాల వైపు వెళ్లకుండా మంచి మార్గంలో సాగాలని సూచించారు. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుని జీవితాలను నష్టపరుచుకోవద్దని అన్నారు. అనంతరం ఖైదీలకు స్వీట్లు పంపిణీ చేశారు. సబ్‌జైలు పర్యవేక్షకులు జాతోతూ నెహ్రూ, డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ బొమ్మ వెంకటేష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నారగోని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## గోడ పత్రికల విడుదల

**ముద్ర, దేవరకొండ :**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీఎం సూర్య ఘర్ సేవా సేతు పథకాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ డీఈ బాల్యనాయక్ తెలిపారు. శుక్రవారం దేవరకొండ ఏడీఈ కార్యాలయంలో ఓం సోలార్ ఎనర్జీ సర్వీసెస్, తుర్జాన్ సోలార్, ఫోర్ట్ ఈవీ సోలార్, శివసాయి మార్కెటింగ్ సంస్థల ఆధ్వర్యంలో సౌర విద్యుత్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఏడీ ఈ ఎన్.శ్రీనివాస్ రెడ్డి, ఏఈ బి. రాజేష్, వి సాయిప్రకాశ్, ఎస్బీఐ ఫీల్డ్ ఆఫీసర్ సచిన్ సింగ్, పాండరి, ఓం సోలార్ ఎనర్జీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ గుండా వెంకటేశ్వరగుప్తా, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి

**ముద్ర, వలిగొండ:**తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండాపురం శ్రీనివాస్ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం నందనం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యేను ఉద్యమకారులు కలిసి తమ సమస్యలను వివరించారు.ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం, ఉచిత బస్సు పాస్, నెలకు రూ.25 వేల పింఛన్, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. కేకే కమిటీ ద్వారా ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేసి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు గుర్తింపు ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

## మతోన్మాదంతో దేశానికి పెనుముప్పు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 2 :** మతోన్మాదంతో దేశానికి పెను ముప్పు పొంచి ఉందని, గాంధీని హత్య చేసిన గాడ్సే వారసులే ప్రస్తుతం దేశాన్ని ఏలుతున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు విమర్శించారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన శాంతియుత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం లౌకికవాదానికి తూట్లు పొడుస్తూ, రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. పథకాల నుంచి గాంధీ పేరును తొలగించినంత మాత్రాన ఆయన సిద్ధాంతాలను చెరిపివేయలేరని స్పష్టం చేశారు. మైనార్టీలను ఇబ్బందులకు గురిచేస్తూ, ఓటు హక్కును తొలగించే కుట్రలను అడ్డుకుంటామని, లౌకికవాద పరిరక్షణకు సిపిఐ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్‌తో పాటు పలువురు నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలి

**ముద్ర, దేవరకొండ:** గ్రామపంచాయతీకి వివిధ వనరుల ద్వారా వచ్చిన ఆదాయం, చేసిన వ్యయాలకు సంబంధించిన వివరాలను ప్రతి నెల కార్యాలయం నోటీస్ బోర్డుపై ఉంచుతామని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ప్రజా ధనాన్ని సభ్యుల ఆమోదంతో సద్వినియోగం చేస్తానని సర్పంచి పసునూరి యుగేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కార్యాలయం ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొందరు వార్డు సభ్యులు పశువుల సంత ద్వారా వచ్చే ఆదాయానికి సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచడం సరికాదని, పలుసార్లు కార్యదర్శిని లెక్కలు చూపించాలని కోరినా స్పందించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేయగా సర్పంచి పై విధంగా స్పందించారు. సమావేశంలో కార్యదర్శి ఢాకునాయక్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీ, ప్రభుత్వ ఉద్యోగి మృతి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఆర్టీసీ బస్సు ఢీ కొని ప్రభుత్వ ఉద్యోగి దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం మెదక్ పట్టణంలో చోటు చేసుకుంది. వ్యవసాయ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న మహ్మద్ సద్దాం హుస్సేన్ అలీ (38)ఉదయం తన రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్ పై ఆఫీసుకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి బయలు దేరాడు. సిడబ్ల్యూసి గోదాం వద్ద భారత్ పెట్రోల్ బంక్ ముందు యు–టర్న్ తీసుకుంటుండగా, సిద్దిపేట నుండి మెదక్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు బస్సు ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ బస్సును అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి తన సోదరుడి మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టడంతో మృతి చెందాడని మృతుని సోదరుడు మహ్మద్ అహ్మద్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555